

4 లో

రొట్టెల పండుగకు సర్వం సిద్ధం

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :208 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శుక్రవారం 26 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

## నీ తండ్రి ఎక్కడ?

అసెంబ్లీ వేదికగా ఉదయనిధిని ప్రశ్నించిన విజయ్.. షాకింగ్ సమాధానం చెప్పిన డీఎంకే!

తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ మీ నాన్న ఎక్కడ?" అని చేసిన వ్యాఖ్య

రాష్ట్ర రాజకీయాల్లో రాజుకున్న తీవ్ర వివాదం.. డీఎంకేలో పెరిగిన ఆవేశం

ఉప ఎన్నికల ద్వారా స్టాలిన్‌ను సభకు తీసుకురావాలని డీఎంకేలో బలపడుతున్న వాదన

మాటల యుద్ధం వ్యక్తిగత దూషణలకు దారితీయడంపై విమర్శలు



తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అసెంబ్లీలో చేసిన 'మీ తండ్రి ఎక్కడ?' అనే పదునైన వ్యాఖ్య రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఒక్క వ్యాఖ్యతో డీఎంకే శ్రేణుల్లో కొత్త ఆవేశం పెల్లుబుకగా, మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను తిరిగి శాసనసభకు తీసుకురావాలనే డిమాండ్లు బహిరంగంగా వినిపిస్తున్నాయి. త్వరలో జరగనున్న ఉప ఎన్నికల ద్వారా మిగతా 2లో...

# 'ఎప్పటికీ క్షమించవద్దు.. ఎప్పటికీ మర్చిపోవద్దు'..

ఎమర్జెన్సీ ఒక ఘోర పాపం: ప్రధాని మోదీ

ఎమర్జెన్సీకి 51 ఏళ్లు.. కాంగ్రెస్‌పై ప్రధాని విమర్శలు

భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం అని వ్యాఖ్య

ఎమర్జెన్సీ విధించిన వారిని ఎప్పటికీ క్షమించవద్దని ప్రజలకు పిలుపు

ఆనాడు ప్రతిపక్ష నేతలను జైల్లో పెట్టారని, మీడియా గొంతు నొక్కారని ఆరోపణ

ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తాను కూడా పోరాడానని గుర్తు చేసుకున్న మోదీ



**న్యూఢిల్లీ:** దేశంలో ఎమర్జెన్సీ విధించి 51 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఇది అత్యంత చీకటి అధ్యాయమని, కాంగ్రెస్ చేసిన ఘోరమైన పాపమని అభివర్ణించారు. ఎమర్జెన్సీని విధించిన వారిని దేశ ప్రజలు 'ఎప్పటికీ క్షమించవద్దు.. ఎప్పటికీ మర్చిపోవద్దు' అని ఆయన పిలుపునిచ్చారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోదీ ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. 'ఎమర్జెన్సీ 51వ వార్షికోత్సవం – భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎంతటి చీకటి అధ్యాయమో తెలుసుకోండి' అనే శీర్షికతో ఆనాటి పరిస్థితులను వివరించారు. "ఎమర్జెన్సీ కాలంలో పౌరుల హక్కులను, మీడియా స్వేచ్ఛను దారుణంగా మిగతా 2లో...



## శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడిపై వ్యాఖ్యలు

హైకోర్టు వేదికగా విచారంవ్యక్తం చేసిన రాహుల్‌గాంధీ

మధ్యప్రదేశ్ ఎన్నికల సమయంలో కార్తికేయ చౌహాన్‌పై రాహుల్ విమర్శలు

పరువు నష్టం కేసు వేసిన కార్తికేయ

తన వ్యాఖ్యలు కార్తికేయను ఉద్దేశించి చేసినవి కావన్న రాహుల్

**న్యూఢిల్లీ:**నేషనల్ పాలిటిక్స్‌లో ఎప్పుడూ అటాక్ మోడ్‌లో ఉండే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఈసారి మాత్రం ఒక అనూహ్యమైన నిర్ణయం తీసుకున్నారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం, ప్రస్తుత కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ కుమారుడు కార్తికేయ సింగ్ చౌహాన్‌పై గతంలో తాను చేసిన కామెంట్స్ పట్ల రాహుల్ గాంధీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్ హైకోర్టులో రాహుల్ తరఫు లాయర్ సమర్పించిన ఒక స్పెషల్ పిటిషన్ ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. గత మధ్యప్రదేశ్ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ప్రచారం చేస్తూ... శివరాజ్ సింగ్ చౌహాన్ ఫ్యామిలీని, ముఖ్యంగా ఆయన కొడుకు కార్తికేయ సింగ్‌ను టార్గెట్ చేస్తూ మిగతా 2లో...

# నీటిని పొదుపుగా వాడదాం

మూడు రాష్ట్రాల సీఎంల భేటీ చరిత్రాత్మకం: సీఎం చంద్రబాబు

తుంగభద్ర డ్యామ్‌కు 33 కొత్త క్రస్ట్ గేట్ల ఏర్పాటు

ఒకే వేదికపై ఏపీ, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు

నదుల అనుసంధానమే దేశాభివృద్ధికి కీలకమన్న చంద్రబాబు

ఎల్ నినో ప్రభావంతో నీటిని పొదుపుగా వాడాలని సూచన

దక్షిణాది రాష్ట్రాల భేటీ చరిత్రలో నిలిచిపోతుందన్న సీఎం




**కర్ణాటక:**కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర ప్రాజెక్టుకు 33 నూతనక్రస్ట్ గేట్లను ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఈ కార్యక్రమం అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చొరవతో ఏపీ, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు ఒకేచోట కలవడం చారిత్రాత్మకమని అన్నారు. కేంద్రమంత్రి తన చొరవతో మూడు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలనే కాకుండా, నదులను కూడా అనుసంధానించారని ఆయన వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాల రైతులకు సాగునీటిని, ఈ ప్రాంత వాసులకు తాగునీటిని అందిస్తోన్న తుంగభద్ర డ్యామ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. 'తుంగా పానం, గంగా స్నానం' అనే సామెతను ప్రస్తావిస్తూ, తుంగ నది నీటి పవిత్రతను కొనియాడారు. 2024లో 19వ నంబర్ గేటు కొట్టుకు పోయినప్పుడు, నిపుణుడు కన్నయ్య నాయుడు సలహాతో స్టాప్‌లాక్ గేట్ అమర్చి నీటి వృధాను అరికట్టామని తెలిపారు. ఇప్పుడు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు సమష్టిగా పనిచేసి 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసి, డ్యామ్‌ను పునరుద్ధరించి రైతుల ప్రయోజనాలను కాపాడామని వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 'వన్ నేషన్ వన్ గ్రిడ్', టెలికాం, రహదారుల నెట్‌వర్క్ వంటి కార్యక్రమాలతో మిగతా 2లో...

# యువతను మాదకద్రవ్యాల వ్యసనం నుండి రక్షించాలి

విఐటి–ఏపీ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత




**విజయవాడ, సింధూరదర్శిని:**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని, ది.25 జూన్ 2026 నాడు విఐటి–ఏపీ విశ్వవిద్యాలయంలో ఈగల్ (EAGLE -- Elite Anti-Narcotics Group for Law Enforcement) ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ, యువత సాధికారతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు అధికారులు మరియు ఇతర ప్రముఖులను ఉద్దేశించి ప్రసంగించిన మంత్రి వంగలపూడి అనిత యువతను మాదకద్రవ్యాల వ్యసనం అనే మిగతా 2లో...



## రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళుతోంది: జగన్

డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీపై కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్న జగన్

వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మండిపాటు

2025-26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి -3.22 శాతంగా నమోదైందని విమర్శ

వివరాలు 2 లో

# ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి పక్కా ప్రణాళిక

మంత్రి కందుల దుర్గేష్

త్వరలోనే టూర్ ఆపరేటర్లు, ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ మరియు ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం

సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్‌ని కలిసి పలు కీలక ప్రతిపాదనలు సమర్పించిన ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఫెడరేషన్



**అమరావతి, సింధూరదర్శిని:** రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ మిగతా 2లో...

## 'ఎప్పటికీ క్షమించవద్దు.. ఎప్పటికీ మర్చిపోవద్దు'..

**(మొదటిపేజీ తరువాయి)**

అణచివేశారు. ప్రతిపక్ష నాయకులందరినీ అరెస్టు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పిన వారిని, రాజకీయ అసమ్మతి తెలిపిన వారిని తీవ్రంగా అణచివేశారు. రచయితలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులతో పాటు సామాన్య పౌరులను కూడా జైళ్లలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు" అని మోదీ ఆరోపించారు. ఆనాడు రాజ్యాంగాన్ని కాలరాశారని, న్యాయవ్యవస్థను రాజకీయ నియంత్రణలోకి తెచ్చేందుకు నీచమైన ప్రయత్నాలు జరిగాయని మోదీ విమర్శించారు. "మీడియాపై తీవ్రమైన ఆంక్షలు విధించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని వారిని బెదిరించారు లేదా పత్రికలను మూసివేశారు. ప్రాథమిక హక్కులను సస్పెండ్ చేశారు. పౌరులను రక్షించాల్సిన ప్రతి వ్యవస్థ వారికే వ్యతిరేకంగా మారింది. పార్లమెంటును కేవలం ఒక 'రబ్బరు స్టాంపు'గా మార్చేశారు" అని ఆయన పేర్కొన్నారు.

అంతటి నిర్బంధం మధ్య కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందరో పోరాడారని మోదీ గుర్తుచేశారు. "వివిధ నేపథ్యాలు, సిద్ధాంతాలకు చెందిన ప్రజలందరూ ఏకమై ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ముందుకు వచ్చారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన ఆ ఉద్యమంలో పాలుపంచుకునే గౌరవం నాకు కూడా దక్కింది" అని ఆయన తెలిపారు.

ప్రజల పోరాట స్ఫూర్తి (జనశక్తి) ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పలేదని, చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేసి ఎన్నికలు నిర్వహించగా, దానిని విధించిన వారు ఘోరంగా ఓడిపోయారని వివరించారు. "ఎమర్జెన్సీ అనే ఘోర పాపం దానిని విధించిన వారి నుదుట శాశ్వతంగా నిలిచిపోతుంది. ఆనాడు ప్రజాస్వామ్యం కోసం దృఢంగా నిలబడిన ప్రతి ఒక్కరికీ ఈరోజు మనం వందనం చేస్తున్నాం. వారి వల్లే ప్రజాస్వామ్యం బతికింది" అని మోదీ పేర్కొన్నారు.

## శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడిపై వ్యాఖ్యలు

**(మొదటిపేజీ తరువాయి)**

కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై కార్తికేయ అస్సలు తగ్గలేదు. ఎలాంటి ఆధారాలు లేకుండా తన క్యారెక్టర్‌ను, ప్రతిష్టను దెబ్బతీసేలా రాహుల్ మాట్లాడారంటూ భోపాల్ కోర్టులో క్రిమినల్ పరువు నష్టం కేసు ఫైల్ చేశారు. ఈ కేసు తీవ్రతను తగ్గించి, దీని నుండి తనకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ రాహుల్ గాంధీ హైకోర్టును ఆశ్రయించారు. "ఆనాడు ఎన్నికల ప్రచారంలో చేసిన వ్యాఖ్యలు కార్తికేయను ఉద్దేశించినవి కావు, పొరపాటున అలా జరిగిపోయింది" అని పేర్కొంటూ కోర్టు వేదికగా విచారం వ్యక్తం చేశారు. ఈ పొరపాటును పరిగణనలోకి తీసుకుని కేసు తీవ్రతను తగ్గించాలని కోర్టును కోరారు. రాహుల్ విన్నపంపై కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే విషయంపై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

## నీ తండ్రి ఎక్కడ?


**(మొదటిపేజీ తరువాయి)**

ఆయన రీఎంట్రీకి రంగం సిద్ధమవుతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేను నడిపించిన ఎంకే స్టాలిన్, తన సొంత నియోజకవర్గం కొలత్తూరులో టీవీకే అభ్యర్థి చేతిలో అనూహ్యంగా ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన అసెంబ్లీకి దూరంగా ఉంటుండగా, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో సీఎం విజయ్ మాట్లాడుతూ ఒక కథ చెబుతూ 'మీ నాన్న ఎక్కడ?' అని ప్రశ్నించారు. ఇది ఉదయనిధిని, సభలో లేని ఆయన తండ్రి స్టాలిన్‌ను ఉద్దేశించి చేసిన పరోక్ష విమర్శగా అందరూ భావించారు. ఈ వ్యాఖ్యలపై స్టాలిన్ స్పందిస్తూ, "నేను ప్రజల హృదయాల్లో ఉన్నాను. అసెంబ్లీలో లేకపోవచ్చు, కానీ ప్రజలు నన్ను ఎక్కడ వెతికితే అక్కడ ఉంటాను" అని బదులిచ్చారు. అయితే, డీఎంకే సీనియర్ నేత, ఎమ్మెల్యే కేఎన్ నెహ్రూ మరింత ఘాటుగా స్పందించారు. "మా నాయకుడిని, మీ నాన్న ఎక్కడ అని అడిగారు కదా? ఆయన వస్తారు. అతి త్వరలోనే వస్తారు. తిరిగి బాధ్యతలు స్వీకరిస్తారు. కానీ ఈ వ్యాఖ్య తర్వాత తమిళనాడు వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు ఆయన రావాలని కోరుకుంటున్నారు" అని అన్నారు. ఈ వ్యాఖ్యలతో స్టాలిన్ పునరాగమనాన్ని పార్టీ ఎంత బలంగా కోరుకుంటుందో స్పష్టమైంది. మరోవైపు సీఎం విజయ్ వ్యాఖ్యలపై ఆయన కూటమిలోని భాగస్వామ్య పక్షాల నుంచి కూడా విమర్శలు వచ్చాయి. వీసీకే అధినేత థోల్ తిరుమావళవన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి హోదాకు ఇటువంటి వ్యాఖ్యలు తగవని, సభా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత సీఎంపై ఉందని హితవు పలికారు. ఈ రాజకీయ మాటల యుద్ధం కాస్తా వ్యక్తిగత దూషణల స్థాయికి చేరింది. ఉదయనిధి స్టాలిన్ తన 'ఎక్స్' ఖాతాలో "చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య" అంటూ చేసిన పోస్ట్, విజయ్ వ్యక్తిగత జీవితంలోని వివాదాలను ఉద్దేశించినదేనని భావిస్తున్నారు. ఇరుపక్షాల నేతలు వ్యక్తిగత జీవితాలను రాజకీయాల్లోకి లాగడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 6 అసెంబ్లీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. తాను గెలిచిన రెండు స్థానాల్లో ఒకటైన తిరుచ్చి ఈస్ట్ స్థానానికి విజయ్ రాజీనామా చేయగా, ఐదుగురు ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. ఈ స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికలు విజయ్ ప్రభుత్వానికి తొలి ప్రధాన అగ్నిపరీక్షగా నిలవనున్నాయి. ఇదే అదనుగా తమ అగ్రనేత స్టాలిన్‌ను తిరిగి సభకు పంపించి, ప్రభుత్వానికి గట్టి పోటీ ఇవ్వాలని డీఎంకే భావిస్తోంది. స్టాలిన్ పోటీపై అధికారికంగా ఎలాంటి ప్రకటన రానప్పటికీ, డీఎంకేలో మాత్రం ఆయన రావాలన్న డిమాండ్ రోజురోజుకూ బలపడుతోంది. సీఎం విజయ్ వ్యాఖ్యే ఇందుకు ఆజ్యం పోసినట్లయింది.

## రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళుతోంది: జగన్

అమరావతి, సింధూరదర్శిని:ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన కీలక హామీలను చంద్రబాబు సర్కార్ పూర్తిగా విస్మరించిందని, వడ్డీ రాయితీ పథకాన్ని నిలిపివేసి మహిళా సంఘాలను నిర్వీర్యం చేస్తోందంటూ ఎక్స్ వేదికగా ఆయన సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. ఏపీలో పన్ను ఆదాయ వృద్ధి పడిపోయిందని, రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళ్తోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని సూపర్ సిక్స్ తరహాలో హామీ ఇచ్చిందని జగన్ అన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పారని మండిపడ్డారు. తమ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.4,969 కోట్ల మేర వడ్డీ రాయితీతో పాటు ఆసరా, చేయూత వంటి స్కీమ్స్‌తో ఆర్థిక భరోసా ఇచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని జగన్ ఆరోపించారు. 2025-26 బడ్జెట్‌లో రూ.100 కోట్లు, మళ్లీ ఇప్పుడు 2026-27 బడ్జెట్‌లోనూ రూ.100 కోట్లు కేటాయించినప్పటికీ.. ఆ నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, గ్రౌండ్ లెవెల్లో ఒక్క పైసా కూడా విడుదల కాలేదన్నారు. ఈ వడ్డీ రాయితీ అమలు చేయకపోవడం వల్ల గత రెండేళ్లలో డ్వాక్రా మహిళలకు సుమారు రూ.6 వేల కోట్ల మేర నష్టం జరిగిందని విమర్శించారు.

# నీటిని పొదుపుగా వాడదాం



**(మొదటిపేజీ తరువాయి)**

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు అన్నారు. ఇదే స్ఫూర్తితో దేశంలో గంగా-కావేరి నదుల్ని అనుసంధానిస్తే భారతదేశం అప్రతిహతంగా ముందుకు సాగుతుందని ఆయన ఆకాంక్షించారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో కెన్-బెత్వా ప్రాజెక్టు ద్వారా నదుల అనుసంధానం విజయవంతమైందని గుర్తుచేశారు. అదేవిధంగా గోదావరి-కావేరి నదులను అనుసంధానించడం ద్వారా కర్ణాటక, ఏపీ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ప్రయోజనాలు నెరవేరతాయని సూచించారు. ఈ ఏడాది ఎల్ నినో కారణంగా తుంగభద్ర, ఆల్మట్టి జలాశయాలకు ఎగువ నుంచి నీటి ప్రవాహాలు తగ్గిపోయాయని, అందుకే నీటిని చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు హెచ్చరించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకే నదుల అనుసంధానం కీలకమని ఆయన పునరుద్ఘాటించారు. ముందుగా రాష్ట్రాల పరిధిలో అంతర్గతంగా నదులను అనుసంధానించు కుని, ఆ తర్వాత అంతర్రాష్ట్ర నదుల అనుసంధానంపై దృష్టి పెట్టాలని సూచించారు. విజయనగర సామ్రాజ్యానికి, హంపీకి తుంగభద్ర నది సహజ రక్షణ కవచంగా నిలిచిందని, జోగులాంబ, హంపీ విరుపాక్ష ఆలయం, రాఘవేంద్ర మఠం వంటి ఎన్నో పుణ్య క్షేత్రాలు ఈ నదీ తీరానే వెలిశాయని చంద్రబాబు గుర్తుచేశారు. 'రాష్ట్రాలుగా మనం వేరైనా, దేశంగా మనం అంతా ఒక్కటే' అని పేర్కొంటూ, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి రైతుల ప్రయోజనాలపై చర్చించడం శుభపరిణామమని అన్నారు. ఈ సమావేశం దక్షిణాది రాష్ట్రాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, అందరం కలిసికట్టుగా రైతుల ప్రయోజనాలను కాపాడు కుందామని ఆయన పిలుపునిచ్చారు.

# యువతను మాదకద్రవ్యాల వ్యసనం నుండి రక్షించాలి

**(మొదటిపేజీ తరువాయి)**




ప్రమాదం నుండి రక్షించాల్సిన అత్యవసర అవసరాన్ని నొక్కిచెప్పారు. మాదకద్రవ్యాల వ్యసనం కేవలం సామాజిక సమస్య మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పని, ఇది యువతలోని ప్రతిభ, ఆరోగ్యం మరియు ఆశయాలను నాశనం చేస్తుందని ఆమె పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న కఠిన చర్యలను ప్రశంసిస్తూ, రాష్ట్రం సాధించిన "జీరో గంజాయి సాగు" విజయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అక్రమ గంజాయి సాగు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల నిర్మూలనలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ, ముఖ్యంగా ఈగల్ బృందాలు నిరంతరం చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగ చరిత్రను ప్రస్తావిస్తూ, 1980ల కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్య వేగంగా విస్తరించిందని, అప్పటి నుండి సమాజాలకు పెద్ద సవాలుగా మారిందని మంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ, అసంప్రదాయ నేర ముఠాలు యువతను లక్ష్యంగా చేసుకుని వారి జీవితాలను మాత్రమే కాకుండా దేశ భద్రత, అభివృద్ధిని కూడా దెబ్బతీస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అత్యంత ముఖ్యమైన విజయాల్లో ఒకటిగా, గత మూడు నుండి నాలుగు దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంతాలు మరియు ఆంధ్ర--ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతాల్లో సుమారు 25 వేల ఎకరాల్లో సాగవుతున్న అక్రమ గంజాయి పంటను పూర్తిగా నిర్మూలించిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. దీనిని చారిత్రాత్మక విజయంగా అభివర్ణిస్తూ, ఈ ఘనతకు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ మరియు ఈగల్ బృందాల అంకితభావమే కారణమని కొనియాడారు. ఈ సందర్భంగా ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ, ఐపీఎస్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో 'జీరో గంజాయి సాగు' సాధన నిరంతర అమలు చర్యలు, నిఘా ఆధారిత ఆపరేషన్లు మరియు ప్రజల భాగస్వామ్య ఫలితం. మా లక్ష్యం కేవలం చట్ట అమలు మాత్రమే కాదు; యువత జీవితాలను రక్షించడం, సమాజంలో అవగాహన పెంపొందించడం, భవిష్యత్ తరాలను మాదకద్రవ్యాల ముప్పు నుండి కాపాడడం కూడా అని తెలియచేసారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలపై పోరాటంపై విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేయాలని, అవగాహన మరియు అప్రమత్తతే యువత భవిష్యత్తును రక్షించే అత్యంత శక్తివంతమైన ఆయుధాలని పేర్కొన్నారు. ఈగల్ సెల్ ఎస్పీ నాగేశ్ బాబు కార్యక్రమంలో పాల్గొన్న వారితో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించి, మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణం మరియు యువతలో ఆరోగ్యకర, బాధ్యతాయుత జీవనశైలిని ప్రోత్సహించేందుకు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ సెల్ ఎస్పీ శస్వరూపారాణి, విఐటి-ఏపీ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ జగదీష్ చంద్ర, డా॥ ఖదీర్ పాషా డిప్యూటీ డైరెక్టర్ (స్టూడెంట్ వెల్ఫేర్) తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని, ది.25 జూన్ 2026 నాడు విఐటి-ఏపీ విశ్వవిద్యాలయంలో ఈగల్ (EAGLE -- Elite Anti-Narcotics Group for Law Enforcement) ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ, యువత సాధికారతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు అధికారులు, ఇతర ప్రముఖులను ఉద్దేశించి ప్రసంగించిన మంత్రి వంగలపూడి అనిత యువతను మాదకద్రవ్యాల వ్యసనం అనే ప్రమాదం నుండి రక్షించాల్సిన అత్యవసర అవసరాన్ని నొక్కి చెప్పారు. మాదకద్రవ్యాల వ్యసనం కేవలం సామాజిక సమస్య మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పని, ఇది యువతలోని ప్రతిభ, ఆరోగ్యం, ఆశయాలను నాశనం చేస్తుందని ఆమె పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న కఠిన చర్యలను ప్రశంసిస్తూ, రాష్ట్రం సాధించిన "జీరో గంజాయి సాగు" విజయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అక్రమ గంజాయి సాగు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల నిర్మూలనలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ, ముఖ్యంగా ఈగల్ బృందాలు నిరంతరం చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ, ఐపీఎస్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో 'జీరో గంజాయి సాగు' సాధన నిరంతర అమలు చర్యలు, నిఘా ఆధారిత ఆపరేషన్లు మరియు ప్రజల భాగస్వామ్య ఫలితం. మా లక్ష్యం కేవలం చట్ట అమలు మాత్రమే కాదు; యువత జీవితాలను రక్షించడం, సమాజంలో అవగాహన పెంపొందించడం, భవిష్యత్ తరాలను మాదకద్రవ్యాల ముప్పు నుండి కాపాడడం కూడా అని తెలియచేసారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలపై పోరాటంపై విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేయాలని, అవగాహన మరియు అప్రమత్తతే యువత భవిష్యత్తును రక్షించే అత్యంత శక్తివంతమైన ఆయుధాలని పేర్కొన్నారు. ఈగల్ సెల్ ఎస్పీ నాగేశ్‌బాబు కార్యక్రమంలో పాల్గొన్న వారితో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించి, మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణం మరియు యువతలో ఆరోగ్యకర, బాధ్యతాయుత జీవనశైలిని ప్రోత్సహించేందుకు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ సెల్ ఎస్పీ శస్వరూపారాణి, విఐటి-ఏపీ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ జగదీష్ చంద్ర, డా॥ ఖదీర్ పాషా డిప్యూటీ డైరెక్టర్ (స్టూడెంట్ వెల్ఫేర్) తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి పక్కా ప్రణాళిక

**(మొదటిపేజీ తరువాయి)**



ప్రతినిధి బృందం మంత్రి దుర్గేష్ ని కలిసి రాష్ట్రంలో పర్యాటక రంగ బలోపేతానికి, పెట్టుబడుల ఆకర్షణకు సంబంధించిన పలు కీలక సూచనలతో కూడిన వినతిపత్రాన్ని అందించింది.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ప్రగతిశీల కార్యక్రమాలను ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులు కొనియాడారు. ముఖ్యంగా ఏపీ పర్యాటక విధానం 2024-29, ఏపీ పర్యాటక భూమి కేటాయింపు విధానం, కార్యాచరణ మార్గదర్శకాలు, బీచ్ షాక్ విధానం, 'హాలిడే ఇన్ ఏపీ / విజిట్ ఏపీ' గ్లోబల్ ప్రచారం తదితర నిర్ణయాలు పర్యాటక రంగ పెట్టుబడిదారులలో నమ్మకాన్ని రెట్టింపు చేశాయని, ఆర్థిక వృద్ధికి బలమైన పునాది వేశాయని మంత్రి దుర్గేష్‌కు ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. పర్యాటక మంత్రిగా ఆయన పనితీరును ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్రంలో టూర్ ఆపరేటర్లు,ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ మరియు ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. "రాబోయే సెప్టెంబర్‌లో నిర్వహించనున్న 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్' సమావేశానికి సంబంధించి అవసరమైన అధ్యయనం చేసి, నివేదికను సిద్ధం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు." జూలై రెండవ వారంలో పర్యాటక శాఖతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఆ తదనంతరం తీసుకునే నిర్ణయాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకెళ్లి వారి మార్గదర్శకాలతో ముందుకు సాగుతామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. మంత్రి దుర్గేష్ కి ఏపీ ఛాంబర్స్ సమర్పించిన ప్రధాన ప్రతిపాదనలు పరిశీలిస్తే.. పరిశ్రమలు, హాస్పిటాలిటీ, ట్రావెల్, ఏవియేషన్, లాజిస్టిక్స్ రంగాలు మరియు ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులతో టూరిజం స్టాక్‌హోల్డర్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న 30 లక్షల మంది ప్రవాసాంధ్రులను భాగస్వాములను చేస్తూ, అంతర్జాతీయ రోడ్‌షోల ద్వారా 'విజిట్ ఏపీ' ప్రచారాన్ని గ్లోబల్‌గా ప్రమోట్ చేయాలని కోరారు.రూ.50 కోట్ల లోపు వ్యయంతో కూడిన ఎంఎస్ఎంఈ పర్యాటక ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు ఇచ్చేలా ఫాస్ట్ ట్రాక్ విధానం ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. హోమ్ స్టేల విషయంలో భద్రతా ప్రమాణాలతో కూడిన సింగిల్-విండో రిజిస్ట్రేషన్ ప్రక్రియను తెచ్చి, వాటిని పర్యాటక శాఖ అధికారిక పోర్టల్ ద్వారా ప్రమోట్ చేయాలన్నారు.ప్రైవేట్ భూముల్లో కొత్త సంస్థలు ప్రతిపాదించే ప్రాజెక్టులను పరిశీలించేటప్పుడు, ప్రమోటర్ల ఆర్థిక బలం, గత రికార్డులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.విజయవాడ - అమరావతి - సూర్యలంక - పాండు రంగాపురం - ఓడరేవు - చీరాల బీచ్ కారిడార్, విశాఖపట్నం - అరకు లోయ సర్క్యూట్, గండికోట - బెలూమ్ గుహలు - యాగంటి తదితర పర్యాటక సర్క్యూట్‌ల అభివృద్ధి మరియు లేపాక్షి, గండికోట, బెలూమ్ గుహలకు యునెస్కో గుర్తింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన పర్యాటక ప్రాంతాలలో స్థానిక ప్రజలు, అధికారులు, ఆపరేటర్ల భాగస్వామ్యంతో డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ కమిటీలు వేయాలని, ప్రత్యేక యాత్రా సర్క్యూట్‌ల కోసం రైల్వేలు, ఎయిర్‌లైన్స్, క్రూజ్ ఆపరేటర్లతో చర్చించాలని మంత్రి దుర్గేష్ కోరారు. ఏపీ ఛాంబర్స్ చేసిన ప్రతిపాదనలపై మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న పర్యాటక ప్రతిపాదనల క్లియరెన్స్‌ను వేగవంతం చేస్తామని, పర్యాటక ప్యాకేజీల ప్రమోషన్ కోసం ఏపీ ఛాంబర్స్ నెట్‌వర్క్‌ను పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కర్ రావు, ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.వి. స్వామి, రాష్ట్ర టూరిజం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మరియు సలహాదారు లక్ష్మీనారాయణ, జీఆర్టీ హోటల్స్ జీఎం హరిప్రసాద్, సేల్స్ మేనేజర్ శ్రీకాంత్, హిరణ్య జర్నీస్ ప్రతినిధి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.







# రొట్టెల పండుగకు సర్వం సిద్ధం

**నేటి నుంచి ఐదు రోజులపాటు రొట్టెల పండుగ**

**కోర్కెల రొట్టెల కోసం దేశ విదేశాల నుంచి కదిలి వస్తున్న భక్తజనం**

**భక్తులతో కళకళలాడుతున్న దర్గా ప్రాంగణం**

**27న గంధ మహోత్సవం - ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా యంత్రాంగం**

**భక్తులకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు - విరివిగా మరుగుదొడ్లు ఏర్పాటు**

**6 వేల మందికి పైగా సిబ్బందితో పరిశుభ్రతకు పెద్దపీట**

**7 జోన్లుగా దర్గా ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు**

**1600 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు**

**స్వర్ణాల చెరువులో గజ ఈతగాళ్లు, బోట్లతో గస్తీ**

**సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా - 12 పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు**

**ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జెసి, మున్సిపల్ కమిషనర్**

నెల్లూరు (సింధూర దర్శిని) 25 జూన్ నెల్లూరు జిల్లా ; మతసామరస్యానికి ప్రతీకగా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు సర్వం సిద్ధమైంది. కోర్కెల రొట్టెల కోసం దేశ విదేశాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. భక్తజన కోర్కెల తరంగాలతో స్వర్ణాల చెరువు సరికొత్త శోభను సంతరించుకుంది. నేటి నుంచి ఈనెల 30 వరకు ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా పండుగను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. దేశ విదేశాల నుంచి భక్తజనం తరలి రావడంతో దర్గా ప్రాంగణం భక్తులతో కళకళలాడుతుంది. ఈనెల 26వ తేదీ సంధల్ మాల్, 27న గంధ మహోత్సవం, 28న రొట్టెల పండుగ, 29న తహలీల్ ఫాతేహా, 30న ముగింపు వేడుకలతో రొట్టెల పండగ ముగియనుంది. రొట్టెల పండుగకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎస్పీ అజిత వేజెండ్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్పొరేషన్ నందన్ నిరంతరం ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు ఇస్తున్నారు.

**6000 మంది పారిశుధ్య సిబ్బంది కేటాయింపు**



రొట్టెల పండుగ లో అత్యంత కీలకమైన పారిశుధ్యానికి పెద్ద పీట వేస్తూ దాదాపు 6 వేల మంది సిబ్బందిని మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా కేటాయించారు. దర్గా పరిసర ప్రాంతాల్లో ఎటువంటి చెత్త కాగితం కనపడకుండా వెంటవెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే భక్తులకు స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు దర్గా ప్రాంతంలో, పార్కింగ్ ప్రదేశాల్లో మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పార్కింగ్ ప్రదేశంలో మొబైల్ టాయిలెట్ సౌకర్యం కల్పించారు. భక్తుల సౌకర్యార్థం స్నానపు గదులను, వాటర్ షవర్ లను, మరుగుదొడ్లను అధికంగా ఏర్పాటు చేశారు. ఏర్పాట్లు మున్సిపల్ కమిషనర్ నందన్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

**భక్తుల భద్రతే మాకు ముఖ్యం అంటున్న పోలీస్ శాఖ**

లక్షలాది భక్తులు విచ్చేసే రొట్టెల పండుగలో భద్రతకు ప్రాధాన్యతనిచ్చి పోలీస్ శాఖ జిల్లా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేసింది. పక్క జిల్లాల నుంచి సిబ్బందిని డిప్యూట్ చేసుకొని, సీసీ, డ్రోన్ కెమెరాల డేగ కళ్ళతో అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే నెల్లూరు నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. 1600 పోలీసులను బందోబస్తు విధులకు కేటాయించారు. దర్గా ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాల్లో సీసీకెమెరాలతో నిరంతరం పర్యవేక్షించేలా ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి దర్గా ప్రాంతమంతా పోలీస్ కనుసన్నల్లో ఉండే ఏర్పాటు చేశారు.

**విద్యుత్ అంతరాయం లేకుండా పది ప్రత్యేక ట్రాన్స్ఫార్మర్లు**

బారాషహీద్ దర్గా పరిసర ప్రాంతాలు దేదీప్యమానంగా వెలుగొందేందుకు నిరంతర విద్యుత్తును అందిస్తామని, ఇందుకుగాను 10 ప్రత్యేక ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేశామని ఎస్ ఈ రాఘవేంద్రన్ తెలిపారు. సిబ్బందితో షిఫ్ట్ ల వారీగా నిరంతరం అప్రమత్తంగా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే దర్గా ప్రాంతంలో ఏర్పాటుచేసిన షాపుల వారు తప్పనిసరిగా విద్యుత్ ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**45 మంది గజ ఈతగాళ్ళతో నిరంతరం గస్తీ**

భక్తులు పుణ్య స్నానమాచరించే స్వర్ణాల చెరువులో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా మత్స్యశాఖ అన్ని చర్యలు తీసుకుంది. 15 బోట్లతో షిఫ్ట్ కు 15 మంది చొప్పున గజ ఈతగాళ్ళతో 3 షిఫ్టుల్లో మొత్తం 45 మందిని నియమించారు. భక్తులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా మత్స్యశాఖ జేడీ చాంద్ భాషా ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాటు చేశారు.

**అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ**

జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణంలో ఎటువంటి అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు, అన్నమయ్య, తిరుపతి, కడప జిల్లాల నుంచి 125 మంది అగ్నిమాపక సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. నాలుగు అగ్నిమాపక యంత్రాలు, రెండు రెస్క్యూ బోటులు, ఒక మిస్ట్ బుల్లెట్, ప్రత్యేక టీమ్ తో 40 మంటలను ఆర్పే మిషన్లను ఏర్పాటు చేశారు. ఘాట్ వద్ద ఎప్పటికప్పుడు నీటిని శుభ్రపరిచేందుకు 10 క్లీనింగ్ పంప్స్ ను ఏర్పాటు చేశారు.

**వైద్య సాయం అంతా ఉచితం అంటున్న వైద్య ఆరోగ్య శాఖ**

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో రొట్టెల పండుగకు విచ్చేసే భక్తులకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ విభాగం నుండి మెడికల్ క్యాంపు, ప్రవేటు మెడికల్ క్యాంపులు, అంబులెన్సు లను సిద్ధం చేశారు. ఇందులో డాక్టర్లతో పాటు వైద్య సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారు.

**విస్తృత ప్రచారానికి సమాచార శాఖ సిద్ధం**

జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రొట్టెల పండుగ విశేషాలను ఫోటోలు, వీడియోలు, వార్త కథనాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు అందించేందుకు పి ఆర్ టీములు సిద్ధమయ్యాయి. అదేవిధంగా దర్గా ప్రాంతం, ఇతర పార్కింగ్ ప్రదేశాల్లో పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ఏర్పాటు చేసి భక్తులకు వివిధ రకాల సమాచారాన్ని అందించేందుకు ఏర్పాటు చేశారు. మీడియా ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల కోసం ప్రత్యేకంగా మీడియా పాయింట్ ను ఏర్పాటు చేశారు.

## అమ్మవారి అలంకరణకు బంగారు లక్ష్మీకాసుల నెక్లెస్ వితరణ

**ఆలయ సహాయక కమిషనర్**

**ఆర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి**



బుచ్చిరెడ్డిపాలెం (సింధూరదర్శిని) 25జూన్ నెల్లూరు జిల్లా; బుచ్చిరెడ్డిపాలెం జొన్నవాడ క్షేత్రంలో వెలసియున్న శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం నందు గురువారం ఆలయ సహాయక కమిషనర్ అర్వ భూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో బెంగళూరు వాస్తవ్యులు ఈ. గోపాలకృష్ణ శ్రీదేవి దంపతులు మరియు ఈ విశ్వేశ్వర్ శ్రీ అమ్మవారి అలంకరణ నిమిత్తం 12 గ్రాముల 170 మిల్లీ గ్రాములు బంగారు లక్ష్మీ కాసులు నెక్లెస్ ను దేవస్థాన కార్యాలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాత గోత్రనామములతో శ్రీ మల్లికార్జున స్వామి వారికి శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి దాతలకు శ్రీవార్ల శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## గూడూరు-విందూరు రోడ్డుకు మోక్షం

**ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**

**గూడూరు- విందూరు రోడ్డుకు నిధులు మంజూరు**



గూడూరు( సింధూర దర్శిని) 25 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు - విందూరు ఆర్ అండ్ బి రోడ్ పనులు 7 కోట్ల రూపాయలతో ప్రారంభించి , త్వరలో పూర్తి చేసి ఆ గ్రామ ప్రజల కోరికను కూటమి ప్రభుత్వం నెరవేస్తుంది అని శాసన సభ్యులు మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశిం సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు రూరల్ మండలం గూడూరు నుండి విందూరు మిట్టాత్మకూరు మీదుగా వీరంపల్లి గ్రామం వరకు ఉన్నటువంటి ఆర్ అండ్ బి రోడ్ గుంతలతో ఉండటం వలన ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.గతంలో పలు కార్యక్రమాలకు వెళ్ళినపడు ప్రజలు ఈ రోడ్ సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే రోడ్ ప్రపోసల్స్ తయారు చేయించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ముఖ్యమంత్రి వర్యులు దాదాపుగా 7 కోట్ల రూపాయలు నిధులు కేటాయించారు. రోడ్ టెండర్లు పూర్తి చేసున్నాము, మొదలు పెట్టె సమయంలో యుద్ధం వలన తారు రేట్లు పెరగడంతో రోడ్ పనులు ప్రారంభించడం ఆలస్యమైనది. ప్రస్తుతం జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేసున్నాము, ఇంకో 10 రోజులలో విందూరు రోడ్ పనులు ప్రారంభిస్తామని ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

## గణపయ్యను దర్శించుకున్న భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి



కాణిపాకం (సింధూర దర్శిని) 25 జూన్ చిత్తూరు జిల్లా ;

కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్, కుటుంబసభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు, వీరితో పాటు టిటిడి బోర్డు సభ్యులు నరేష్, స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ కోదండపాణి, సీ.ఐ శ్రీధర్ నాయుడు, కాణిపాకం ఎస్సై నరసింహులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి (సింధూర దర్శిని) 25 జూన్ తిరుపతి జిల్లా ; ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా డిఆర్ఓ జీ నరసింహులుతో కలిసి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పై వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను ఇంట్లో కూర్చొని నింపడం లేదా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా వివరాలు నమోదు చేయడం వంటి చర్యలు ఏ పరిస్థితుల్లోనూ అనుమతించబడవని స్పష్టం చేశారు. ఇటువంటి నిర్లక్ష్యం లేదా అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ పై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సస్పెన్షన్‌కు కూడా గురయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ శారదా దేవి, తిరుపతి, కాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు రామ్మోహన్,భానుప్రకాష్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ రోజ్ మాండ్, భరత్ నాయక్, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు,ఏ ఈ ఆర్ ఓ లు మరియు చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రతినిధి పులివర్తి సుధారెడ్డి, యస్వంత్, వైయస్సార్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ గోపాల్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రెసిడెంట్ సామంచి శ్రీనివాస్, సిపిఎం నుంచి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు,జనసేన పార్టీ మనోహర్, బూత్ లెవెల్ ఆఫీసర్లు అన్ని పార్టీల నుండి ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనపై సమీక్ష సమావేశం

### జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు

### అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించిన జాయింట్ కలెక్టర్

### ఎలిప్యాడ్, సభ వేదికలను అధికారులు నాయకులతో పరిశీలించిన జాయింట్ కలెక్టర్



గూడూరు( సింధూరదర్శిని) 25 జూన్ నెల్లూరు జిల్లా ; రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గూడూరు నియోజకవర్గం లో పర్యటన సందర్భంగా గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం అధికారులు, నాయకులతో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జులై 1వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గూడూరు నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా హెలీ ప్యాడ్ , సభా వేదికలకు అనువుగా ఉండే విధంగా గూడూరు గాని చిల్లకూరు మండల పరిధిలో గాని పరిశీలించడం జరుగుతుందని, భద్రత పరంగా ప్రజా సౌకర్యాలు దృష్ట్యా ఏది సౌకర్యంగా ఉంటుందో త్వరలోనే ఖరార్ చేసి ప్రకటిస్తామని తెలిపారు. అంతేకాకుండా చిల్లకూరు మండల పరిధిలోని ఓడూరు



పంచాయతీలో హెలిపాడ్ సభా వేదికలకు అనుకూలంగా ఉండే విధంగా స్థల పరిశీలన నాయకులు , అధికారులతో పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అరుణ కుమారి తాసిల్దార్లు గూడూరు తాసిల్దార్ రాపూర్ వెంకటప్రసాద్ , చిల్లకూరు తాసిల్దార్ గోపీనాథ్ రెడ్డి కోట తాసిల్దార్ జేజేరావు, మండల సర్వేయర్లు మల్లికార్జున్, డిప్యూటీ తాసిల్దార్ చైతన్య, నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య ,చిన్న వైయస్సార్, దువ్వూరు రాజశేఖర్ రెడ్డి , గుండాల లీలావతి, చిట్టేటి నారాయణ, పెనుబోలు జానకిరామ్ రెడ్డి , కీరవాణి, తదితర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రొట్టెల పండుగ బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు సిబ్బందికి బ్రీఫింగ్



### జిల్లా ఎస్పీ అజితా వెజెండ్ల

నెల్లూరు ( సింధూర దర్శిని) 25 జూన్ నెల్లూరు జిల్లా ; గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి సూచనల మేరకు, బారా షాహిద్ దర్గా రొట్టెల పండుగ--2026 సందర్భంగా చేపట్టిన పటిష్ట బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ డా. ఆజిత వేజెండ్ల పోలీసు అధికారులు, సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించారు. రొట్టెల పండుగను ప్రశాంత వాతావరణంలో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విజయవంతంగా నిర్వహించడమే లక్ష్యమని తెలిపారు. విధుల్లో ఉన్న ప్రతి పోలీసు సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బారా షహిద్ దర్గా రొట్టెల పండుగ 26.06.2026 నుండి 30.06.2026 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో మొత్తం 1743 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెయిన్ దర్గా, ఘాట్ ఏరియా, ట్రాఫిక్, పార్కింగ్ ప్రాంతాలను సెక్టార్లుగా విభజించి ప్రతి సిబ్బందికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ముఖ్యమైన గంధ మహోత్సవం రోజున మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. దర్గా పరిసర ప్రాంతాలు మరియు పార్కింగ్ ప్రాంతాలను 96 సిసి కెమెరాలు, 26 డ్రోన్ కెమెరాల ద్వారా 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ అధికారులు దొంగతనాలు, నేరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, గత సంఘటనలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. వాహనాల పార్కింగ్ నిర్వహణ అత్యంత కీలకమని, భక్తులు తమ వాహనాలను కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలిపేలా చర్యలు తీసుకోవాలని, స్పెషల్ పాస్ లు లేకుండా ఎట్టి పరిస్థితిలో ఇతర వాహనాలు దర్గా లోపలికి అనుమతి లేదు అని తెలిపారు.

#### ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు

రొట్టెల పండుగ సందర్భంగా ట్రాఫిక్ సజావుగా నిర్వహించేందుకు, 3 ప్రధాన ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లు, 2 భారీ వాహనాల డైవర్షన్ మార్గాలు, 21 పార్కింగ్ ప్రాంతాలు - 9 మేజర్, 12 మైనర్ పార్కింగ్ జోన్లు ,20 మూవింగ్ పార్టీలు ,95 ట్రాఫిక్ రెగ్యులేషన్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెక్టార్ ఇంచార్జ్ అధికారులు ప్రతి షిఫ్ట్ ప్రారంభానికి ముందు సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించాలని, విధులు ముగిసిన అనంతరం డీ-బ్రీఫింగ్ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఐడీ కార్డు, విజిల్, రైన్ కోట్, డ్యూటీ పాస్‌పోర్ట్‌లతో కేటాయించిన ప్రదేశాల్లో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. అలసత్వం, గైర్హాజరు వంటి అంశాలను తీవ్రంగా పరిగణించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును విజయవంతం చేయాలని సూచించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో యాంటీ సబోటేజ్ తనిఖీలు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్యూఆర్టి బృందాల ద్వారా విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. బందోబస్తులో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి అవసరమైన వసతులు, భోజన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లు (అడ్మిన్) సౌజన్య , అప్పారావు దీక్ష, ఘట్టమనేని శ్రీనివాస రావు, రమణ కుమార్, గిరిధర్, చందమోహన్, గాంధీ రెడ్డి, రామకృష్ణ ,ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. భక్తులు మరియు సందర్శకులు పోలీసులకు సహకరించి రొట్టెల పండుగను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.






## పేద విద్యార్థులకు వరం డ్రీమ్ ఇండియా ఫౌండేషన్

గూడూరు ( సింధూర దర్శిని) 25 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని సొసైటీలో ఉన్న డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ కార్యాలయంలో ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు చదివే విద్యార్థిని విద్యార్థులకు ఉచిత విద్య కొరకు ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం వారి తల్లిదండ్రులతో ఫౌండేషన్ కమిటీ సభ్యులు ఆర్థిక స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. 36 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు బొమ్మిరెడ్డి సురేందర్ రెడ్డి




మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలనే ఉద్దేశంతో 17 సంవత్సరాల క్రిందట డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ ప్రారంభించడం జరిగిందని తెలిపారు ఆర్థికంగా వెనుకబడి బాగా చదువుకునే పిల్లలను ఎంపిక చేసి వారు పదో తరగతి వరకు ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో చదివించడం జరుగుతుందని ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ వరకు పొడిగించామని తెలిపారు అనేక మంది పేద విద్యార్థులు ఫౌండేషన్ ద్వారా చదువుకొని పలు ఉద్యోగాల్లో ఉన్నారని గురువారం 12 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని వారికి ఇంటర్మీడియట్ వరకు చదివిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దశరథరామిరెడ్డి, బాలకృష్ణ రాజు, నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కారును ఢీకొన్న లారీ

### తృటిలో తప్పిన ప్రమాదం



గూడూరు (సింధూర దర్శిని) 25 జూన్ నెల్లూరు జిల్లా; రోడ్డు ప్రమాదంలో కారును లారీ బలంగా ఢీకొట్టింది. పోలీసుల వివరాల మేరకు చిల్లకూరు మండల పరిధిలోని తిరుమల పాల డైరీ వద్ద ముందు పోతున్న కారును లారీ వెనక నుండి ఢీ కొట్టిందని, ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు ఇవ్వలేదని కారు కుడివైపు పూర్తిగా డ్యామేజ్ అయిందని తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులు అరెస్ట్

**సుమారు రూ.2 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం**

**నిందితులు అలవాటుగా చోరీలకు పాల్పడుతున్న హ్యాబిట్యువల్ అఫెండర్లుగా గుర్తింపు**

**నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచన**



తిరుపతి ( సింధూర దర్శిని) 25 జూన్ తిరుపతి జిల్లా ; శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న చోరీల కేసులను శ్రీకాళహస్తి II టౌన్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. జిల్లాఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, అదనపు ఎస్పీ ఎ. శ్రీనివాసులు పర్యవేక్షణలో, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహామూర్తి ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

**ఈ కేసులో అరెస్టు చేయబడిన నిందితులు**

1. ఎ. నరేష్, వయస్సు 42 సంవత్సరాలు, నివాసం – నెహ్రూ నగర్, శ్రీకాళహస్తి.
2. కృష్ణారి జగదీష్ కుమార్ అలియాస్ జగదీష్, వయస్సు 43 సంవత్సరాలు, నివాసం – బీఎస్ రైల్వే కాలనీ, శ్రీకాళహస్తి.

నిందితులిద్దరూ గతంలో కూడా పలు చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్న వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు.

శ్రీకాళహస్తి II టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన రెండు చోరీ కేసులపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు మరియు ఇతర సమాచారాన్ని విశ్లేషించి నిందితులను గుర్తించారు.



దర్యాప్తులో భాగంగా నిందితులు ఉపయోగించిన ఏపీ03దీ1855 నంబర్ గల ఆటోను గుర్తించి, వారి కదలికలను పర్యవేక్షించారు. అనంతరం నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులు గతంలో కూడా అనేక చోరీ కేసుల్లో పాల్గొన్న హ్యాబిట్యువల్ అఫెండర్లుగా పోలీసులు నిర్ధారించారు.

**స్వాధీనం చేసుకున్న సొత్తు**

**నిందితుల వద్ద నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆస్తులు:**

సుమారు 1.3 గ్రాముల బరువు గల బంగారు రాయి పొదిగిన ఉంగరం.
సుమారు 1 గ్రాము బరువు గల బంగారు డాలర్ పెండెంట్.
సుమారు 300 మిల్లీగ్రాముల బరువు గల బంగారు ముక్కుపుడక.
సుమారు 1.5 గ్రాముల బరువు గల బంగారు ఉంగరం.
సుమారు 1.8 గ్రాముల బరువు గల బంగారు చెవి పోగులు.
సుమారు 1.6 గ్రాముల బరువు గల బంగారు మాటీలు.

సుమారు 1.5 గ్రాముల బరువు గల బంగారు గొలుసు పెండెంట్.
వెండి పూజా సామగ్రి మరియు ఇతర వెండి వస్తువులు.
వెండి పళ్లాలు, గిన్నెలు, గ్లాసులు తదితర సామగ్రి.
వెండి గంధపు గిన్నె
నేరానికి ఉపయోగించిన ఆటో రిక్షా (ఏపీ03దీ1855).

స్వాధీనం చేసిన మొత్తం ఆస్తి విలువ సుమారు రూ. 2,00,000/–గా అంచనా వేయబడింది. ప్రజలు తమ ఇళ్లలోని విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని, ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో 112, మహిళల భద్రత కోసం 181, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని కోరారు.

ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు దొంగిలించబడిన ఆస్తులను స్వాధీనం చేసుకున్న శ్రీకాళహస్తి II టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులను మరియు దర్యాప్తు బృందాన్ని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు అభినందించారు. పోలీసుల అప్రమత్తత, సాంకేతిక దర్యాప్తు మరియు సమన్వయంతో కేసు వేగంగా ఛేదించబడిందని ప్రశంసించారు.

# అర్హులైన ప్రతి ఒక్క ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అవ్వాలి: సంయుక్త కలెక్టర్



గుంటూరు, ( సింధూర దర్శిని):ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై పురోగతి , ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఫారాల పూర్తి, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓ లతో కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అతోతిష్ శ్రీవాస్తవ సమావేశం నిర్వహించారు. జిల్లాలో సర్ కార్యక్రమం అమలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, బిఎల్ ఓ పనితీరు, ప్రజలకు ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేయించడంపై సమావేశంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా బి ఎల్ ఓ లు పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్క ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. డిఆర్ఓ ఎన్.ఎస్.కే.ఖాజావలి మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాలు ఏ విధంగా పూర్తి చేయాలనేది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో బి ఎల్ ఓ లు బి ఎల్ ఏ లతో సమావేశాలు నిర్వహించి ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేసేందుకు ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు మార్గదర్శకం చేయాలన్నారు. సమావేశపు మినిట్స్ ను యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. బి ఎల్ ఓ లు ఇంటింటికి వెళ్లి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు ఈ నెల 15వ తేది నుండి జులై 14 వరకు రెండు ఫారాలను అందించి పూర్తి చేసిన ఫారాలలో ఒక దాని మీద ఓటరు సంతకం చేసిన ఫారాన్ని తీసుకొని, బి ఎల్ఓలో సంతంకం చేసిన ఫారాన్ని ఓటరుకు అందించాలన్నారు. తరువాత వాటిని డిజిటలైజేషన్ చేయాలన్నారు. ఇలా చేయడం వలన డెత్ , వలసలు , డూప్లికేట్ లను గుర్తించవచ్చన్నారు. ఈ వివరాలన్ని డి ఈ ఓ లాగిన్ లో కనిపిస్తాయన్నారు. పోలింగ్ స్టేషన్ల మార్పులు చేర్పులకు జూలై 14 వరకు ప్రోపోజల్స్ పంపవచ్చన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను జూలై 21న ప్రచురించడం జరుగుతుందని, అభ్యంతరాలు, ఫిర్యాదులు ఏమైనా వుంటే జూలై 21 నుండి ఆగష్టు 20 వరకు స్వీకరించడంజరుగుతుందన్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు జులై 21 నుండి సెప్టెంబర్ 18 పరిష్కరిస్తారని, తుది ఓటరు జాబితాను సెప్టెంబర్ 22 న విడుదల చేయడం జరుగుతుందన్నారు. తాడికొండ, మంగళగిరి, తెనాలి, ప్రత్తిపాడు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల్లో పోలింగ్ స్టేషన్స్ లొకేషన్ మార్పులు , ప్రతిపాదించిన కొత్త పోలింగ్ స్టేషన్స్ ను రాజకీయ పార్టీలు ఆమోదం తెలిపాయి. పొన్నూరు , గుంటూరు తూర్పు నియోజకవర్గాల్లో పోలింగ్ స్టేషన్ల పరిధిలో మార్పులపై పెండింగ్‌లో వుంచడం జరిగింది. సమావేశంలో గుంటూరు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారులు శ్రీనివాసరావు, శ్రీరమణి, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు, ఎన్నికలవిభాగం పర్యవేక్షకులు మల్లీశ్వరి, అమ్ ఆద్మీ పార్టీ తరపున డా. సేవా కుమార్ పాల్గొన్నారు.

# ఇల్లు కోల్పోతున్న పేదలకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాము: కంచుమాటి అజయ్



గుంటూరు( సింధూర దర్శిని): నల్లపాడు నుండి బీబీనగర్ వరకు కొత్త రైల్వే లైను నిర్మాణంకోసం మేడికొండూరు మండలంలోని సిరిపురం గ్రామంలో ఇల్లు కోల్పోతున్న పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని దీని సహించేది లేదని వారికి న్యాయమైన నష్టపరిహారం ఇవ్వనట్లయితే ఆందోళన సిద్ధం అవుతామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ తెలిపారు. గురువారం సాయంత్రం గుంటూరులోని ఆర్డిఓ ఆఫీస్ కార్యాలయంలోకి సిరిపురం లో 40 ఇండ్లు కోల్పోతున్న పేద ప్రజల అభిప్రాయం కోసం కార్యాలయంలో చర్చిం చడం జరిగింది. దీంట్లో భాగంగా అధికారులు తెలిపిన లెక్కల ప్రకారం లక్షలాది రూపాయలు విలువచేసే ఇండ్లను కేవలం వేల రూపాయలు నష్టపరిహారం వస్తుందని తెలపటం పేద ప్రజలకు అన్యాయం చేసినట్లే అన్నారు.ఎప్పుడో 10 సంవత్సరాల క్రితం కట్టుబాటు విలువ ను అంచనా వేసి రేటు ప్రకటించటం ఎంతవరకు సమంజసం ఉన్నారు. ఇల్లు కోల్పోయిన పేదలు స్థలం కేటాయించి మరల పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. మరికొందరు రోజువారి కూలీ చేసుకుని డబ్బులు కూడా పెట్టి పక్క బిల్డింగ్ నిర్మించుకోవడం జరిగింది. దీని ప్రకారం నేడున్న మార్కెట్ ప్రకారం కట్టుబాటుకి ఎంత అవుతుందో అంతే డబ్బులు ఇవ్వాలి అన్నారు. మరొకవైపు భూమి కోల్పోతున్న రైతులకు కూడా మాయమాటలు చెప్పి తక్కువ రేటు ఇవ్వాలని ఇస్తామని ప్రకటనలు చేస్తున్నారు. బలవంతంగా నమ్మించి ఒప్పిస్తున్నారు. దీని వలన భవిష్యత్తులో ఆ రైతులు నష్టాలు ఎదుర్కొనక తప్పదని అన్నారు. అందువల్ల రైల్వే లైనుకు నిర్మాణం కొరకు ఇవ్వటానికి సిద్ధమైన ఇల్లు కోల్పోయిన పేదలకు రైతులకు మార్కెట్ ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లిస్తే వారు మరొక్క చోట ఇండ్లు నిర్మించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. లేనిపక్షంలోనే రాష్ట్ర ప్రభుత్వ స్థలం కొనుగోలు చేసి ఆ స్థలంలో పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ పేదలకు అన్యాయం చేసి రాష్ట్ర అభివృద్ధి అని చెప్పటం ఎంతవరకు సరైనది అన్నారు. కొందరు కూలీలుగా మరికొందరు కౌలు సాగు చేసుకుంటూ జీవన సాగించే ఈ పేదల గురించి ప్రభుత్వం ఆలోచించకుండా ఇల్లు కూలుస్తామని అనడం ఏమాత్రంసహించరానదన్నారు. అవసరమైతే కోర్టుకెళ్లిన సరే రైల్వే లైను కొనసాగకుండా ఆపిస్తామని హెచ్చరిక చేశారు.

## మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై రాజకీయ కక్షతోనే అక్రమ కేసు

**– మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు**



అచ్చంపేట ( సింధూర దర్శిని): రాజకీయ కక్షతో అక్రమంగా అరెస్టు అయ్యి కోర్ట్ బెయిల్ పై విడుదల అయిన బొల్లా బ్రహ్మ నాయుడు ను గురువారం నర్సరావుపేట లోని వారి వారి స్వగృహంలో పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నబత్తున శివకుమార్ , ఎన్టీఆర్ జిల్లా వై యస్ ఆర్ సీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్, అద్దంకి నియోజకవర్గ ఇంచార్జి చింతలపూడి అశోక్, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇంచార్జి తన్నీరు నాగేశ్వరావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ బాధితుడినే బాధ్యుడిని చేసి అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. అనుకూల మీడియాలో వార్తలు రాయించి ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులతో భయపెట్టి,అనగతొక్కాలని చూస్తున్నారన్నారు. ప్రజలు అంతా చూస్తున్నారని త్వరలో మీకు బుద్ధి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నూతన దంపతులకు ఎమ్మెల్యే ప్రవీణ్ దంపతుల ఆశీర్వాదం



అమరావతి, (సింధూరదర్శిని):అమరావతి మండలం వైకుంఠపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బోగినేని శేషుబాబు కుమారుని వివాహం స్థానిక ధరణికోట గ్రామంలోని జేబీ గార్డెన్‌లో జరుగగా వివాహ వేడుకకు హాజరైన శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ దంపతులు మరియు జిల్లా అధ్యక్షులు షేక్ జానీ ,సీనియర్ నాయకులు కంచేటి సాయిబాబు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రవీణ్ దంపతులతో పాటు స్థానిక మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణ పనులు నిర్విఘ్నంగా జరగాలి

**చండీహోమంలో ఎమ్మెల్యే జూలకంటి**



మాచర్ల,(సింధూరదర్శిని): శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థాన నిర్మాణ పనులు నిర్విఘ్నంగా పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. గురువారం పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థాన వద్ద నిర్మాణదశలో ఉన్న ఆలయంలో నిర్వహించిన చండీహోయంలో పాల్గొన్న ఆయన భక్తులతో చర్చించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, కజ్జం సైదయ్య, సత్యనారాయణ రెడ్డి, చంటి, చందు, వీరు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పై రాజకీయ కక్షతోనే అక్రమ కేసు

**మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు**

అమరావతి ( సింధూర దర్శిని):రాజకీయ కక్షతో అక్రమంగా అరెస్టు అయ్యి కోర్ట్ బెయిల్ పై విడుదల అయిన బొల్లా బ్రహ్మ నాయుడు ని గురువారం నరసరావుపేట లోని వారి స్వగృహంలో పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నబత్తున శివ కుమార్, ఎన్టీఆర్ జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్,అద్దంకి నియోజకవర్గ ఇంచార్జి చింతలపూడి అశోక్ , జగ్గయ్యపేట నియోజకవర్గ ఇంచార్జి తన్నీరు నాగేశ్వరావు లు కలిశారు. ఈ సందర్భంగా పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ బాధితుడినే బాధ్యుడిని చేసి అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గం అని అన్నారు. అనుకూల మీడియాలో వార్తలు రాయించి ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులతో భయపెట్టి, అనగతొక్కాలని చూస్తున్నారన్నారు. ప్రజలు అంతా చూస్తున్నారని త్వరలో మీకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## శరీరంపై దురద, ఎర్రటి పొక్కులతో బాధపడుతున్నారా?

-మీ ఫ్రిజ్‌లోనే ఉంది అసలైన మందు!

-ఓట్ మీల్, చందనం, కలబందతో తక్షణ ఉపశమనం

-చర్మానికి చలువనిచ్చి దురదను తగ్గించే సహజ మార్గాలు

-సమస్య తీవ్రంగా ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచన

దేశవ్యాప్తంగా వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు, తేమ విపరీతంగా పెరగడంతో.. చాలా మందిని వేధించే ప్రధాన సమస్య 'చెమటకాయలు'. చర్మంపై ఉండే చెమట గ్రంథుల ద్వారాలు మూసుకుపోవడం వల్ల మెడ, ఛాతి, వీపు భాగాల్లో ఎర్రటి పొక్కులు, దురద, మంట పుడతాయి. అయితే, రసాయనాలతో కూడిన ఖరీదైన క్రీములకు బదులుగా, మన వంటింట్లో, ఫ్రిజ్‌లో ఉండే కొన్ని సులభమైన వస్తువులతోనే ఈ సమస్యకు సహజంగా చెక్ పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.ఇటీవలి నివేదికల ప్రకారం, చర్మాన్ని చల్లబరిచి, చెమటకాయల మంటను తగ్గించే 5 అద్భుతమైన వంటింటి చిట్కాలు ఇవే:

**ఓట్ మీల్..**

ఓట్ మీల్‌లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మంపై వచ్చే ఎరుపుదనాన్ని, దురదను సమర్థవంతంగా తగ్గిస్తాయి. పొడి చేసిన ఓట్స్‌ను చల్లని నీటిలో కలిపి పేస్ట్‌లా చేసి, చెమటకాయలు ఉన్న చోట రాసి కొద్దిసేపటి తర్వాత కడిగేయాలి. ఇది చర్మానికి ఒక రక్షణ పొరలా పనిచేస్తుంది.

**కలబంద ...**

తాజా కలబంద ఆకుల నుండి తీసిన జెల్ చర్మానికి తక్షణ చలువను, తేమను అందిస్తుంది. ఎండల వల్ల కలిగే చర్మంపై మంటను తగ్గించడానికి ఎలాంటి జిడ్డు లేకుండా పనిచేసే సహజమైన మందు ఇది. దీనిని నేరుగా చర్మంపై రాసి కాసేపటి తర్వాత కడిగేసుకోవచ్చు.

**చందనం పొడి...**

భారతదేశంలో సంప్రదాయంగా వాడే చందనం పొడి చర్మాన్ని చల్లబరచడంలో తిరుగులేనిది. చందనం పొడికి కొద్దిగా గులాబీ నీరు కలిపి పేస్ట్‌లా చేసి చర్మంపై రాయాలి. అది ఆరిపోయిన తర్వాత కడిగేసుకుంటే చెమటకాయల వల్ల వచ్చే సూదులతో పొడిచినటువంటి మంట నుండి తక్షణ ఉపశమనం లభిస్తుంది.

**దోసకాయ...**

దోసకాయలో నీటి శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఫ్రిజ్‌లో ఉంచిన చల్లటి దోసకాయ ముక్కలను నేరుగా చర్మంపై పెట్టడం లేదా దాని రసాన్ని కాటన్ ప్యాడ్‌తో చెమటకాయలపై రాయడం వల్ల చర్మానికి మంచి రిఫ్రెష్ ఫీలింగ్ లభిస్తుంది.

**కొబ్బరి నీళ్లు**

శరీరం లోపలి నుండి వేడిని తగ్గించడానికి కొబ్బరి నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. ఎండలకు విపరీతంగా చెమటలు పట్టినప్పుడు శరీరంలో ఎలక్ట్రోలైట్స్ తగ్గకుండా ఇవి కాపాడుతాయి. అలాగే, చల్లటి కొబ్బరి నీళ్లను చర్మంపై చల్లుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది.

**నిపుణుల సూచన**

ఈ చిట్కాలతో పాటు లూజ్ కాటన్ దుస్తులు ధరించడం, ఎండ తగలకుండా చల్లని ప్రదేశాలలో ఉండడం, చర్మ రంధ్రాలను మూసివేసే హెవీ బాడీ క్రీములను వాడకపోవడం వంటి జాగ్రత్తలు కూడా తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అయితే, చెమటకాయలు తీవ్రమై వాపు రావడం, చీము పట్టడం లేదా జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

## భారత్-ఐర్లాండ్ టీ20 మ్యాచ్‌ల సమయాల్లో కీలక మార్పు

సాయంత్రం 6 గంటలకే మ్యాచ్‌లు ప్రారంభం

అదే రోజు మహిళల ప్రపంచకప్‌లో భారత్ మ్యాచ్

జూన్ 26, 28న రెండు టీ20లు

**బెల్‌ఫాస్ట్‌లో మ్యాచ్‌ల నిర్వహణ - శ్రేయస్ అయ్యర్‌కు కొత్త బాధ్యత**

భారత్, ఐర్లాండ్ మధ్య జరగనున్న రెండు టీ20 మ్యాచ్‌ల సమయాలను గంట ముందుకు జరిపారు. తొలుత సాయంత్రం 7 గంటలకు (భారత కాలమానం ప్రకారం) ప్రారంభం కావాల్సిన మ్యాచ్‌లు ఇప్పుడు సాయంత్రం 6 గంటలకే మొదలుకానున్నాయి. జూన్ 28న జరిగే రెండో టీ20 మ్యాచ్, మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌తో సమయం కలిసిపోతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. క్రికెట్ ఐర్లాండ్, భారత ప్రసార భాగస్వాముల మధ్య చర్చల తర్వాత మ్యాచ్ సమయాల్లో మార్పు చేశారు. బెల్‌ఫాస్ట్‌లోని సివిల్ సర్వీస్ క్రికెట్ క్లబ్ వేదికగా జూన్ 26, 28 తేదీల్లో ఈ రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సిరీస్‌తో శ్రేయస్ అయ్యర్ భారత టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనుండగా, ఐర్లాండ్ జట్టుకు లోర్కన్ టక్కర్ నాయకత్వం వహించనున్నాడు.




# ఇంకా చీకట్లోనే 65 కోట్ల మంది..

# ఐరాస నివేదికలో షాకింగ్ నిజాలు!

గణనీయంగా మందగించిన విద్యుద్దీకరణ పనులు - 200 కోట్ల మంది ఇంకా కాలుష్య కారక ఇంధనాలతోనే వంట

విద్యుత్ కొరత ఎక్కువగా సబ్-సహారన్ ఆఫ్రికా దేశాల్లోనే - ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు తాజా నివేదికలో వెల్లడి

ప్రపంచం సాంకేతికంగా ఎంత ముందుకు దూసుకు పోతున్నా, అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపుతున్నా.. భూమిపై ఉన్న కోట్లాది మంది ప్రజలకు కనీస విద్యుత్ సౌకర్యం కూడా అందడం లేదనేది చేదు నిజం. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ దాదాపు 65.5 కోట్ల మంది ప్రజలు (ప్రపంచ జనాభాలో 8 శాతం) కరెంట్ లేని చీకటి జీవితాలనే గడుపుతున్నారని ఐరాస భాగస్వామ్య సంస్థలు విడుదల చేసిన తాజా 'ట్రాకింగ్ SDG 7: ది ఎనర్జీ ప్రోగ్రెస్ రిపోర్ట్ 2026' వెల్లడించింది.

జూన్ 24న విడుదలైన ఈ నివేదిక ప్రకారం.. గత పదేళ్లతో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియ వేగం భారీగా మందగించింది. 2023, 2024 మధ్య కాలంలో కేవలం 1.15 కోట్ల మందికి మాత్రమే కొత్తగా విద్యుత్ సౌకర్యం లభించింది. ఈ వేగం అంతకుముందు దశాబ్దపు సగటు వేగంతో పోలిస్తే సగం మాత్రమే కావడం ఆందోళన కలిగిస్తోంది.

**ఆఫ్రికాలోనే అత్యధికం**

ఈ విద్యుత్ కొరత ప్రభావం అత్యధికంగా సబ్-సహారన్ ఆఫ్రికాలోని గ్రామీణ, తక్కువ ఆదాయం ఉన్న, అంతర్గత ఘర్షణలు ఎదుర్కొంటున్న ప్రాంతాలపై పడింది. ప్రపంచవ్యాప్తంగా కరెంట్ లేని వారిలో అత్యధికులు ఈ ప్రాంతానికి చెందినవారే. మరోవైపు, విద్యుత్ మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ వంట కోసం కాలుష్యాన్ని వెదజల్లే సంప్రదాయ ఇంధనాలపై (కట్టెలు, బొగ్గు వంటివి) ఆధారపడుతున్నారని నివేదిక స్పష్టం చేసింది. "65.5 కోట్ల మందికి కరెంట్ లేదు, మరో 200 కోట్ల మంది కాలుష్య కారక ఇంధనాలతో వంట చేస్తూ తమ ఆరోగ్యాన్ని, ప్రాణాలను పణంగా పెడుతున్నారు" అని ప్రపంచ బ్యాంక్ , ఐరాస సంయుక్త ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశాయి.



**సవాళ్లు.. పరిష్కారాలు**

అంతర్జాతీయంగా పేద దేశాలకు అందుతున్న ఆర్థిక సాయం తగ్గడం, మారుమూల ప్రాంతాలకు విద్యుత్ లైన్లు వేయడానికి అయ్యే భారీ ఖర్చులు ఈ మందగమనానికి ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. క్లీన్ కుకింగ్ (పరిశుభ్రమైన వంట ఇంధనం) వాడకం ప్రపంచవ్యాప్తంగా 75 శాతానికి చేరినప్పటికీ, ఇదే వేగం కొనసాగితే 2030 నాటికి కూడా 180 కోట్ల మందికి ఈ సౌకర్యం అందే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు.

విద్యుత్, గ్యాస్ లేకపోవడం వల్ల కేవలం వెలుతురు మాత్రమే కాదు.. పేద దేశాల్లో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కూడా దెబ్బతింటున్నాయని ఐరాస పేర్కొంది. ఈ అంతరాన్ని పూడ్చడానికి అంతర్జాతీయ సమాజం తక్షణమే పెట్టుబడులను పెంచాలని, వినూత్న పరిష్కారాలతో ముందుకు రావాలని నివేదిక పిలుపునిచ్చింది.


# నిమిషాల్లో డెలివరీ.. ఇండియాలో ఇదే మా ఫాస్టెస్ట్ బిజినెస్: అమెజాన్ సీఈఓ

భారత్‌లో తమ ఫాస్టెస్ట్ గ్రోయింగ్ బిజినెస్ 'అమెజాన్ నౌ' అన్న సీఈఓ ఆండీ జెస్సీ - నిమిషాల వ్యవధిలోనే నిత్యావసరాలు డెలివరీ చేస్తున్న క్విక్ కామర్స్ సర్వీస్

ఈ సేవను వినియోగిస్తున్న ప్రైమ్ మెంబర్లు మూడు రెట్లు ఎక్కువగా షాపింగ్ చేస్తున్నారని వెల్లడి

ప్రతి త్రైమాసికంలో ఆర్డర్లు రెట్టింపు అవుతున్నాయని తెలిపిన అమెజాన్ - దేశవ్యాప్తంగా 300 నగరాలకు ఈ సేవలను విస్తరించేందుకు ప్రణాళిక

ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌కు భారత మార్కెట్ అత్యంత కీలక కేంద్రంగా మారింది. కంపెనీ క్విక్-కామర్స్ విభాగంలో ప్రవేశపెట్టిన 'అమెజాన్ నౌ' సర్వీస్, దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపారంగా నిలిచిందని అమెజాన్ సీఈఓ ఆండీ జెస్సీ వెల్లడించారు. ఈ సేవ ద్వారా వినియోగదారులు ఆర్డర్ చేసిన నిమిషాల వ్యవధిలోనే సరుకులు డెలివరీ అవుతుండటంతో దీనికి అనూహ్యమైన ఆదరణ లభిస్తోందని ఆయన తెలిపారు.భారత పర్యటనలో ఉన్న ఆండీ జెస్సీ, ముంబైలోని అత్యంత రద్దీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన 'అమెజాన్ నౌ' మైక్రో-ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా తన అనుభవాలను పంచుకుంటూ.. "భారత్‌లో ఉండటం, ముంబైలోని మైక్రో-ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించడం చాలా బాగుంది. ప్రజలకు తక్షణం అవసరమయ్యే కిరాణా సరుకులు, షాంపూలు, బేబీ ప్రొడక్టులు వంటివి ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే ప్యాక్ చేసి డెలివరీ చేస్తున్నారు" అని ఆయన ప్రశంసించారు.



ఈ మైక్రో-ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలను ప్రత్యేకంగా నిత్యావసర వస్తువులను వేగంగా ప్యాక్ చేసి, డెలివరీ చేసేందుకు వీలుగా డిజైన్ చేశారు. ఈ సేవను ఉపయోగించడం ప్రారంభించిన ప్రైమ్ మెంబర్లు, తమ షాపింగ్ ఫ్రీక్వెన్సీని మూడు రెట్లు పెంచారని జెస్సీ గణాంకాలతో వివరించారు. భారత్‌లో ఈ సర్వీస్ ప్రారంభించినప్పటి నుంచి ప్రతి త్రైమాసికంలో ఆర్డర్ల సంఖ్య రెట్టింపు అవుతోందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద 'డెలివరీ-ఇన్-మినిట్స్' నెట్‌వర్క్‌ను నిర్మించాలనే లక్ష్యంతో 'అమెజాన్ నౌ' సేవలను 300కు పైగా నగరాలకు విస్తరించనున్నట్లు జెస్సీ తెలిపారు. అంతేగాక భారత్‌లో క్విక్-కామర్స్ మోడల్‌ను నిర్మించడంలో నేర్చుకున్న పాఠాలు, ఆవిష్కరణలు ఇప్పుడు అమెరికా సహా ఇతర అంతర్జాతీయ మార్కెట్లలో ఇలాంటి సేవలను విస్తరించేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఆయన చెప్పారు. భారత మార్కెట్‌లో వృద్ధి అవకాశాలపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసిన ఆయన, ఈ వ్యాపార నిర్మాణంలో పాలుపంచుకున్న బృందాలు, భాగస్వాములను చూసి గర్వపడుతున్నానని, భారత మార్కెట్లో సాధించాల్సింది ఇంకా చాలా ఉందని వ్యాఖ్యానించారు.

## రోబోటిక్స్ నుంచి సీఏ టాపర్ వరకు.. ముంబై యువకుడి అసాధారణ ప్రయాణం

సీఏ ఇంటర్‌లో ఏఐఆర్-3 సాధించిన తీర్థ్ జైన్

600కు 519 మార్కులు.. 86.5 శాతం

పదో తరగతిలో 99 శాతం మార్కులు

చిన్నప్పటి నుంచే రోబోటిక్స్‌పై ఆసక్తి

జావా నేర్చుకుని ఆండ్రాయిడ్ యాప్ రూపకల్పన


థింక్ స్కూల్‌లో కంటెంట్ పనులు

సింధూరదర్శిని:సీఏ పరీక్షల్లో అగ్రస్థానం సాధించిన వారి కథల్లో ఎక్కువగా కనిపించేది ఒకటే. పుస్తకాలు, క్లాసులు, నిరంతర సాధన. కానీ ముంబైకి చెందిన తీర్థ్ జైన్ కథ మాత్రం కాస్త భిన్నం. అకౌంట్స్ చదువుతూనే రోబోటిక్స్‌లో పాల్గొన్నాడు. కోడింగ్ నేర్చుకున్నాడు. కంటెంట్ క్రియేటర్‌గా పనిచేశాడు. కాలేజీ కార్యక్రమాలకు నాయకత్వం వహించాడు. ఇప్పుడు అదే యువకుడు దేశవ్యాప్తంగా సీఏ ఇంటర్మీడియట్‌లో మూడో ర్యాంక్ సాధించి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. మే 2026లో నిర్వహించిన సీఏ ఇంటర్మీడియట్ పరీక్షల్లో తీర్థ్ జైన్ 600 మార్కులకు గాను 519 మార్కులు సాధించాడు. 86.5 శాతం మార్కులతో ఆల్ ఇండియా మూడో ర్యాంక్ దక్కించుకున్నాడు. దేశవ్యాప్తంగా వేలాది మంది అభ్యర్థులు పరీక్ష రాసినా రెండు గ్రూపులు కలిపి ఉత్తీర్ణత సాధించిన వారి శాతం కేవలం 8.47 మాత్రమే ఉండటం అతని విజయానికి మరింత ప్రత్యేకత తీసుకొచ్చింది.



తీర్థ్ విద్యా ప్రస్థానం కూడా అంతే మెరుగ్గా సాగింది. ఐసీఎస్ఈ పదో తరగతిలో 99 శాతం మార్కులు సాధించాడు. అనంతరం ముంబైలోని హెచ్ఆర్ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనామిక్స్‌లో ఇంటర్ పూర్తి చేసి 96.17 శాతం మార్కులు పొందాడు. కాలేజీలో ఐదో ర్యాంక్ సాధించాడు. సీఏ ఫౌండేషన్ పరీక్షలో కూడా దేశవ్యాప్తంగా 21వ ర్యాంక్ సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. అయితే తీర్థ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది అతని బహుముఖ ప్రతిభ. చిన్నప్పటి నుంచే టెక్నాలజీపై ఆసక్తి పెంచుకున్నాడు. రోబోటిక్స్ పోటీల్లో పాల్గొన్నాడు. టీనేజ్‌లోనే జావా భాషను స్వయంగా నేర్చుకుని ఒక ఆండ్రాయిడ్ యాప్‌ను రూపొందించాడు. పైథాన్, డేటా విజువలైజేషన్, అడ్వాన్స్‌డ్ స్ప్రెడ్‌షీట్లు, అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్‌లపై కూడా పట్టు సాధించాడు. చదువుతో పాటు వృత్తిపరమైన అనుభవాన్ని కూడా సంపాదించాడు. జూనియర్ కాలేజీలో చదువుతున్న సమయంలోనే ప్రముఖ బిజినెస్ కంటెంట్ ప్లాట్‌ఫామ్ 'థింక్ స్కూల్'తో కలిసి పనిచేశాడు. కంటెంట్ రీసెర్చ్, సోషల్ మీడియా నిర్వహణ, ఆడియన్స్ స్ట్రాటజీ వంటి విభాగాల్లో రెండేళ్లకు పైగా సేవలందించాడు. సాధారణంగా డిజిటల్ మీడియా నిపుణులు చేసే పనులను విద్యార్థి దశలోనే నిర్వహించడం విశేషం. కాలేజీ రోజుల్లో నాయకత్వ లక్షణాలను కూడా చాటుకున్నాడు. హెచ్ఆర్ కాలేజీ 'ఇన్‌సైట్ క్లబ్' అధ్యక్షుడిగా 60 మందికి పైగా విద్యార్థులతో కూడిన బృందాన్ని నడిపించాడు. పలు కాలేజీల విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషించాడు. వక్తృత్వం, డిబేట్‌లు, పరిశోధన పత్రాల సమర్పణలో బహుమతులు గెలుచుకున్నాడు. క్రీడల్లోనూ ప్రతిభ చాటాడు. జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో పాఠశాలకు ప్రాతినిధ్యం వహించాడు. అథ్లెటిక్స్, స్కేటింగ్‌లో పలు పతకాలు సాధించాడు. 'అథ్లెట్ ఆఫ్ ది ఇయర్' అవార్డు కూడా అందుకున్నాడు. సాంకేతికత, నాయకత్వం, కమ్యూనికేషన్, కామర్స్.. ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా తనదైన ముద్ర వేసిన తీర్థ్ జైన్, ఇప్పుడు సీఏ ఇంటర్మీడియట్‌లో దేశంలో మూడో ర్యాంక్ సాధించి మరోసారి వార్తల్లో నిలిచాడు. ఒకే లక్ష్యానికి పరిమితం కాకుండా విభిన్న రంగాల్లో అనుభవం సంపాదిస్తూ కూడా అత్యున్నత విజయాలు సాధించవచ్చని అతని ప్రయాణం నిరూపిస్తోంది.

# మీరు సమాజంలో ప్రతి చోట గౌరవం పొందాలనుకుంటే, మీలో 4 లక్షణాలు ఉన్నాయో లేదో తెలుసుకోండి..



**చాణక్య నీతి:** జీవితంలో గౌరవం కావాలంటే అందులో నాలుగు గుణాలు ఉండాలి అని చాణక్య తన విధానాలలో పేర్కొన్నాడు.

**అగ్రస్థానంలో ఉండడం ద్వారా ఇతరులను గౌరవించడం నేర్చుకోండి**

విశ్వాసంతో బాధ్యతలు తీసుకోవడం చాలా ముఖ్యం. జ్ఞానం మరియు అవగాహన ప్రతిచోటా గౌరవించబ డతాయి. ఆచార్య చాణక్యుని మార్గదర్శకాలు చాలా ఆచరణాత్మకమైనవి మరియు జీవన కళను బోధిస్తాయి. చాణక్య తన జీవితాన్ని మెరుగుపరుస్తూనే జీవితంలోని ప్రతి అంశానికి సంబంధించిన అనేక విషయాలు చెప్పాడు. చాణక్య ప్రకారం, డబ్బు మరియు ర్యాంక్ పరంగా ఎవరూ విజయవంతం కాలేరు. సమాజంలో ఆదర్శప్రాయంగా మరియు గౌరవించే ఈ వ్యక్తులు విజయవంతమైన వ్యక్తుల వర్గంలో ఒక భాగం మాత్రమే. కీర్తి మరియు కీర్తి కూడా మరణానంతరం ప్రశంసించబడిన వారు వాస్తవానికి ఉన్నతంగా భావిస్తారు. సమాజంలో ప్రజలు గౌరవించబ డ్డారని ఆచార్య తన చాణక్య నీతి పుస్తకంలో వివరించారు.

సమాజంలో గౌరవం ఇష్టపడని వారు ఎవరు ఉంటారు, కాని అందరూ అంధులు కాదు. గౌరవం పొందినవారికి వాటిలో కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి మరియు అందుకే అలాంటి వ్యక్తులు ప్రతిచోటా గౌరవించబడతారు. అందువల్ల, మీరు సమాజంలో మరియు దేశంలో మరియు విదేశాలలో కూడా గౌరవం పొందాలని మీరు కోరుకుంటే, మీలో నాలుగు లక్షణాలు ఉండాలి. ఈ లక్షణాల గురించి ఆచార్య చాణక్య వివరంగా వివరించారు. ఈ లక్షణాలు ఎవరిలోనైనా ఉంటే, అతనికి ప్రతిచోటా గౌరవం లభిస్తుందని అతను నమ్ముతాడు.

**చాణక్య నీతి : ఈ లక్షణాలుండే స్త్రీలను పెళ్లి చేసుకుంటే అంతే సంగతులట...!**

నిజం మాట్లాడేవారికి మాత్రమే గౌరవం లభిస్తుంది జీవితంలో సత్య మార్గంలో నడిచేవాడు అన్ని వైపుల నుండి గౌరవాన్ని పొందుతాడు. సత్యానికి మార్గం ఖచ్చి తంగా కష్టం కాదు మరియు నడవడం అంత సులభం కాదు. ఎవరైనా ఈ మార్గాన్ని అనుసరించాలని నిర్ణయించుకుంటే, వారికి ఏమీ అసాధ్యం. సత్య మార్గంలో నడిచిన తరువాత, ఈ వ్యక్తులు మమ్మల్ని గౌరవించడం ప్రారంభిస్తారు. ఆచార్య చాణక్య మాట్లాడుతూ నిజం మాట్లాడేవాడు ఖచ్చితంగా కొంతమంది దృష్టిలో పడతాడు, కాని ఆ వ్యక్తికి కూడా గౌరవం లభిస్తుంది. నిజం మాట్లాడేవాడు ఖచ్చితంగా కష్టాలను ఎదుర్కోవలసి ఉంటుంది, కాని అతను ప్రజల దృష్టిలో నిజాయితీపరుడని నిరూపించబడితే, ప్రపంచం అతని తలపై కూర్చుంటుంది. అలాంటి వ్యక్తి ఎక్కడికి వెళ్లినా గౌరవం పొందుతాడు.

**మీరు గౌరవించబడటానికి గౌరవం కూడా చూపించాలి**

మీరు గౌరవం పొందాలంటే ఇతరులను గౌరవించాలని చాణక్య విధానాలు చెబుతున్నాయి. ఈ అలవాటు ఉన్న వారికి గౌరవం లభిస్తుంది, ఇతరులు మిమ్మల్ని గౌరవించాలని మీరు కోరుకుంటే, మీరు కూడా వారిని గౌరవించాలి. మీరు అవతలి వ్యక్తిని గౌరవిస్తేనే, మరొకరు మిమ్మల్ని గౌరవిస్తారు. ఇతరులను గౌరవించే వారికి మాత్రమే సమాజంలో గౌరవించే హక్కు ఉంటుంది. ఇతరులను అవమానించడం లేదా బాధపెట్టడం ఇష్టపడే వ్యక్తులు వారిని ఎప్పుడూ గౌరవించరు. మీరు మీ పదవి నుండి వైదొలిగిన వెంటనే, ప్రజలు కూడా మీ గౌరవాన్ని వదులుకుంటారు, కానీ మీరు సీనియర్ ఆఫీసర్ అయి ప్రజలతో మర్యాదగా మాట్లాడితే, మీ గౌరవం జీవితాంతం కొనసాగుతుంది.

**చాణక్య నీతి ప్రకారం ఈ ప్రాంతాల్లో మీరు అస్సలు ఉండకూడదు, అక్కడ ఉంటే జీవితం సర్వనాశనం**

**బాధ్యతలను భరించడం నేర్చుకోండి**

జీవితంలో పొరపాట్లు జరుగుతాయి, కానీ మీరు ఆ తప్పుకు బాధ్యత తీసుకోకపోతే, మీ ఇమేజ్ మంచిది కాదు. మరోవైపు, ఏదైనా పని ముందుకు సాగే బాధ్యత మీ విశ్వాసాన్ని చూపిస్తుంది మరియు ఇది ఇతరుల యొక్క విశ్వాసాన్ని ఆకర్షిస్తుంది. ఒక వ్యక్తి యొక్క ఆధిపత్యం అతనిలో ఉన్న లక్షణాలు మరియు చర్యలపై ఆధారపడి ఉంటుంది. ప్రజలు మరింత బాధ్యత వహించే వారిని బాగా గుర్తుంచుకుంటారు. అటువంటి వ్యక్తి, జాగ్రత్తగా మరియు నిజాయితీతో బాధ్యత తీసుకుంటాడు, సమాజంలో విలువైన వాడు. వారి బాధ్యతల గురించి తెలుసు. ప్రతిచోటా వారి గురించి బాగా తెలిసిన ఈవ్యక్తులు గౌరవపాత్రలు అవుతారు

**సమాజంలోని మంచి కోసం జ్ఞానాన్ని ఉపయోగించడం**

సమాజంలోని మంచి కోసం జ్ఞానాన్ని ఉపయోగించడం: తమ జ్ఞానాన్ని సాధారణ మంచి కోసం ఉపయోగించుకునే వ్యక్తులు సమాజంలో కూడా గౌరవించబడతారు. చెడు చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం నుండి ఏది సరైనది. ఏది తప్పు అనే దాని గురించి సమాచారం అందించడం వరకు ప్రజలకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంటుంది.వారి స్థానం ప్రతి ఒక్కరి హృదయంలో ఉంటుంది.

# సముద్రం దాటి.. సింగపూర్‌కు ఆంధ్రా బంగినపల్లి మామిడి



భారత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి రంగంలో ఒక కీలక మైలురాయి నమోదైంది. అత్యంత ప్రసిద్ధి చెందిన బంగినపల్లి మామిడి పండ్లను తొలిసారిగా వాణిజ్యపరంగా సముద్ర మార్గం ద్వారా సింగపూర్‌కు విజయవంతంగా ఎగుమతి చేశారు. ఈ చారిత్రాత్మక ముందడుగు ద్వారా తక్కువ ఖర్చుతో, పర్యావరణ హితంగా తాజా పండ్లను అంతర్జాతీయ మార్కెట్లకు చేరవేసేందుకు కొత్త మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఎగుమతి ప్రక్రియను వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) పర్యవేక్షించింది. ఇందులో భాగంగా, ఓసమ్ ఫుడ్ సొల్యూషన్స్ సంస్థ 5 మెట్రిక్ టన్నుల బంగినపల్లి మామిడి పండ్లను జూన్ 11న ఎగుమతి చేయగా, ఈ కన్సైన్‌మెంట్ జూన్ 24న సింగపూర్ తీరానికి చేరుకుంది. ఈ మొత్తం ప్రక్రియ విజయవంతం కావడంలో లక్నోలోని ఐకార్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సబ్‌ట్రాపికల్ హార్టికల్చర్ (సీఐఎస్‌హెచ్) కీలక పాత్ర పోషించింది.

**రైతులకు రెట్టింపు లాభం**

ఈ ఎగుమతి కోసం ఆంధ్రప్రదేశ్‌లోని 'గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్' (జీఏపీ) ధ్రువీకరణ పొందిన తోటల నుంచి మామిడి పండ్లను సేకరించారు. అనంతరం కర్ణాటకలోని అపెడా గుర్తింపు పొందిన ప్యాక్‌హౌస్‌లో వీటిని శుద్ధి చేసి ప్యాకింగ్ చేశారు. ఈ ఎగుమతి రైతులకు ఆర్థికంగా భారీ ప్రయోజనాన్ని చేకూర్చింది. స్థానిక మార్కెట్‌లో కిలో మామిడి ధర రూ. 25 నుంచి రూ. 26 ఉండగా, ఎగుమతి ద్వారా రైతులకు కిలోకు సుమారు రూ. 50 లభించింది. దీంతో రైతుల ఆదాయం దాదాపు రెట్టింపు అయింది. సింగపూర్‌లో ఈ పండ్లను దిగుమతి చేసుకున్న ఈసీ-లింక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, మామిడి నాణ్యత అద్భుతంగా ఉందని ప్రశంసించింది. పండ్ల తీపిదనం, ఒకేరీతిలో పక్వానికి రావడం, ఎక్కువ కాలం నిల్వ ఉండటం వంటి లక్షణాలను ప్రత్యేకంగా అభినందించింది. సింగపూర్ నిర్దేశించిన నాణ్యత, ఫైటోశానిటరీ నిబంధనలను ఈ కన్సైన్‌మెంట్ విజయవంతంగా అందుకుంది. శాస్త్రీయ పద్ధతుల్లో కోత అనంతర యాజమాన్యం, సముద్ర రవాణాలో కోల్డ్-చైన్ లాజిస్టిక్స్ సమర్థతను ఇది నిరూపించింది.

**ఎగుమతులకు కొత్త ఊపు**

బంగినపల్లి మామిడి తన బంగారు పసుపు రంగు, చక్కటి సువాసన, పీచులేని గుజ్జు, అద్భుతమైన తీపిదనంతో అంతర్జాతీయంగా మంచి పేరు పొందింది. ఈ విజయవంతమైన ఎగుమతి, తాజా పండ్ల రవాణాకు వాయు మార్గంతో పోలిస్తే సముద్ర మార్గం ఎంతో చౌకైనది, పర్యావరణ హితమైనది, వాణిజ్యపరంగా లాభదాయకమైనదని రుజువు చేసింది. శక్తిమంతమైన కోల్డ్-చైన్ మౌలిక సదుపాయాలు, శాస్త్రీయ నిర్వహణ పద్ధతుల మద్దతుతో సముద్ర రవాణా భారత ఉద్యానవన ఎగుమతుల పోటీతత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా బలోపేతం చేస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వ్యవసాయ ఎగుమతులను పెంచడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, భారత వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడం అనే ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అపెడా ఈ చొరవ తీసుకుంది. ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని ఉద్యానవన ఉత్పత్తులను సముద్ర మార్గంలో ఎగుమతి చేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

# అద్దంకిలో ఏడీఎంఎస్ ఈ-బైక్స్ షోరూమ్ ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి, సింధూరదర్శిని: అద్దంకి టౌన్‌లోని శింగరకొండ రోడ్‌లో భవిత ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏడీఎంఎస్ ఈ-బైక్స్, ఎలక్ట్రికల్ స్కూటీల షోరూమ్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ హితమైన విద్యుత్ వాహనాలను అద్దంకి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన భవిత ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యాన్ని అభినందించారు. రాష్ట్రంలో ఇంధన పొదుపు, కాలుష్య నియంత్రణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వల్ల ఇంధన వ్యయం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొంటూ ప్రజలు అధిక సంఖ్యలో ఈ-వాహనాలను వినియోగించాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రికల్ వాహనాల రంగంలో ఏడీఎంఎస్ ఈ-బైక్స్ జాతీయ స్థాయిలో నాణ్యత, మన్నికలో ముందువరుసలో ఉన్నాయని మంత్రి అన్నారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన కంపెనీని ఎంపిక చేసుకోవడం నిర్వాహకుల వ్యాపారాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, భవిత ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యం, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో మోసపోయారా?.. రూ.25వేల వరకు పరిహారం.. ఆర్‌బీఐ కొత్త రూల్!




ఆన్‌లైన్‌లో ఒక తప్పుడు లింక్ క్లిక్ చేసినా, నకిలీ కేవైసీ అప్‌డేట్ పేరుతో మోసపోయినా ఖాతాలోని డబ్బులు మాయమయ్యేవి. పోయిన డబ్బులు తిరిగి వస్తాయన్న నమ్మకం చాలా మంది బాధితుల్లో ఉండేది కాదు. ఈ పరిస్థితిని సమూలంగా మార్చేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రంగంలోకి దిగింది. డిజిటల్ చెల్లింపుల మోసాల బాధితులకు ఊరట కల్పించేలా, బ్యాంకులను మరింత జవాబుదారీగా మార్చేలా సరికొత్త మార్గదర్శకాలను ప్రకటించింది. ఈ కొత్త నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. దేశంలో యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ లావాదేవీలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాలు కూడా అదే స్థాయిలో పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో డిజిటల్ మోసాల బారిన పడిన వినియోగదారులకు ఆర్థికంగా భరోసా కల్పించడం లక్ష్యంగా ఆర్‌బీఐ ఈ కొత్త ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది. దీని ప్రకారం, అనధికారికంగా జరిగిన డిజిటల్ లావాదేవీని గుర్తించిన ఐదు రోజుల్లోగా కస్టమర్ తన బ్యాంకుకు ఫిర్యాదు చేస్తే, దర్యాప్తు అనంతరం షరతులకు లోబడి గరిష్ఠంగా రూ. 25,000 వరకు పరిహారం పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయే బాధితులకు ఈ నిర్ణయం కాస్త ఊరటనివ్వనుంది.అయితే, బాధితులకు పరిహారం అందించడం ఈ ప్రణాళికలో ఒక భాగం మాత్రమే. అసలు మోసాలు జరగకుండా నిరోధించడంపై కూడా ఆర్‌బీఐ దృష్టి సారించింది. ఇందులో భాగంగా బ్యాంకులు తమ అంతర్గత రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) మోడల్స్ వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది.

| |
|---|
| డిజిటల్ చెల్లింపుల మోసాలపై ఆర్‌బీఐ కీలక నిర్ణయం |
| బాధితులకు రూ. 25,000 వరకు పరిహారం అందించే యోచన |
| మోసం జరిగిన 5 రోజుల్లోగా బ్యాంకుకు ఫిర్యాదు చేయడం తప్పనిసరి |
| 2027 జనవరి 1 నుంచి ఈ కొత్త నిబంధనల అమలు |

ఈ రెండు కార్యక్రమాలకు మధ్య బలమైన సంబంధం ఉంది. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడం, మోసపూరిత పద్ధతులను పసిగట్టడం, కస్టమర్ల ఖాతాలను నిజ సమయంలో పర్యవేక్షించడం కోసం బ్యాంకులు ఎక్కువగా ఏఐ వ్యవస్థలపైనే ఆధారపడుతున్నాయి. ఈ ఏఐ మోడల్స్‌ను మరింత మెరుగ్గా నిర్వహిస్తే, వినియోగదారులు డబ్బు కోల్పోకముందే మోసాలను గుర్తించి ఆపే అవకాశం పెరుగుతుంది.

ఈ విషయంపై ఈవై ఇండియా భాగస్వామి, ఫైనాన్షియల్ సర్వీసెస్ రిస్క్ మేనేజ్‌మెంట్ లీడర్ అజయ్ సిరికొండ మాట్లాడుతూ, "ఏఐ సంబంధిత రిస్క్‌లను ఎలా నిర్వహించాలనే దానిపై భారతీయ బ్యాంకులకు ఆర్‌బీఐ మార్గదర్శకాలు ఒక స్పష్టమైన ప్రణాళికను అందించాయి. వినియోగదారుల రక్షణ, థర్డ్-పార్టీ మోడల్స్, ఏఐ వంటి అంశాలను ఒకే చట్రంలోకి తీసుకురావడంలో ఈ మార్గదర్శకాలు అమెరికా, యూకే రెగ్యులేటర్ల కన్నా ముందున్నాయి" అని వివరించారు. ఇన్నాళ్లూ ఏఐ వాడకంపై స్పష్టమైన నియమావళి లేకపోవడం బ్యాంకులకు ఒక అడ్డంకిగా ఉండేదని, ఇప్పుడు ఆర్‌బీఐ మార్గదర్శకాలతో ఆ అనిశ్చితి తొలగిపోయిందని ఆయన అన్నారు. "ఇది ఏఐ వినియోగానికి అడ్డంకి కాదు, వాస్తవానికి దాని వేగాన్ని మరింత పెంచుతుంది" అని సిరికొండ అభిప్రాయపడ్డారు. వినియోగదారుల పరంగా చూస్తే, ఈ కొత్త నిబంధనల నుంచి నేర్చుకోవాల్సిన ముఖ్యమైన పాఠం ఒకటే. డిజిటల్ మోసానికి గురైనప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకూడదు. ఎంత వేగంగా బ్యాంకుకు సమాచారం ఇస్తే, పోయిన డబ్బు తిరిగి పొందే అవకాశాలు అంతగా పెరుగుతాయి. బాధితులు వేగంగా స్పందించడం, బ్యాంకులు అత్యాధునిక సాంకేతికతతో మోసాలను అడ్డుకోవడం.. ఈ రెండూ జరిగితేనే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరింత సురక్షితంగా మారుతుంది.

# సినిమా న్యూస్




రితిక నాయక్: చీరకట్టులో అద్భుతమైన హొయలు మరియు తెలుగు చిత్రసీమలో పెరుగుతున్న స్టార్‌డమ్. ఈ అందమైన ఛాయాచిత్రంలో, ముదురు ఎరుపు మరియు టీల్ (నీలం-ఆకుపచ్చ మిశ్రమ) రంగుల చీరలో హుందాగా పోజిస్తూ రితిక నాయక్ అద్భుతంగా, ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నారు.

## బాలయ్య కల సాకారం.. రాజధానిలో కొరటాల శివతో కొత్త చిత్రం ప్రారంభం


నటసింహం నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబి నేషన్‌లో ఓ భారీ చిత్రం రాబోతు న్నట్లు ప్రకటన వచ్చిన నాటి నుంచే ఇండస్ట్రీలో అంచనాలు పెరిగాయి. ఆ అంచనాలకు మరింత ఊపునిస్తూ, ఈ క్రేజీ ప్రాజెక్ట్ (వర్కింగ్ టైటిల్ 'చీదీఖ 112') ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా పూజా కార్యక్రమాలతో అట్టహాసంగా ప్రారంభమైంది. సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వేడుక జరిగింది.




ఈ చిత్రాన్ని ఎస్‌ఎల్‌వీ సినిమాస్ పతాకంపై నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సినిమాను సుమారు రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్టు నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, 2027 వేసవి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. అమరా వతిలో ఈ సినిమాను ప్రారంభించడం వెనుక ఓ ప్రత్యేక కారణం ఉందని నిర్మాత సుధాకర్ చెరుకూరి వివరించారు. "రాజధాని అమరా వతిలో ఒక భారీ సినిమా ప్రారంభోత్సవం చేయాలనేది బాలకృష్ణ గారి చిరకాల స్వప్నం. అది మా సినిమాతో నెరవేరడం చాలా గర్వంగా ఉంది. ప్రకాశం జిల్లా వాడినైన నేను, మన రాజధాని నడిబొడ్డున ఈ సినిమాను లాంచ్ చేయడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి. గత మూడు నాలుగేళ్లుగా బాలయ్య గారితో సినిమా చేయాలన్న నా కోరిక ఇప్పటికి నెరవేరింది" అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ కేవలం వినోదాన్ని పంచడమే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక కళాకారులకు, సాంకేతిక నిపుణులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యం తో ముందుకు సాగుతున్నట్లు చిత్రబృందం పేర్కొంది. ఏపీలో ఉన్న ప్రతిభావంతులకు ఈ సినిమాలో ప్రాధాన్యత ఇస్తామని, ఈ సినిమా స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రంలో మరిన్ని ఫిలిం స్టూడియోలు ఏర్పాటవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక సందేశాన్ని మాస్ ఎలిమెంట్స్‌తో చెప్పడంలో సిద్ధహస్తుడైన కొరటాల శివ, బాలయ్యను ఎలా చూపిస్తారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## కార్తి 'సర్దార్ 2' విడుదల తేదీ ఖరారు!



హీరో కార్తి కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్ 2' విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని 2026, సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఒక పవర్‌ఫుల్ ప్రమోషనల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఈ వీడియోలో రా ఏజెంట్ చంద్రబోస్ అలియాస్ సర్దార్ పాత్రలో కార్తి వృద్ధుడి గెటప్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. మంటల మధ్య రైఫిల్ పట్టుకుని నిలబడిన ఆయన లుక్, సినిమాలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉండనున్నాయని స్పష్టం చేస్తోంది. "ఏజెంట్ కార్తి వస్తున్నాడు.. జీవితకాలపు మిషన్‌కు సిద్ధంగా ఉండండి" అనే క్యాప్షన్‌తో ఈ అప్‌డేట్‌ను పంచుకున్నారు. 2022లో ఘన విజయం సాధించిన 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా ఇది తెరకెక్కుతోంది. మొదటి భాగం రూ. 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో, ఈ సీక్వెల్‌ను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సర్దార్ ఆరిజిన్ స్టోరీతో పాటు, అతని కుమారుడు ఇన్‌స్పెక్టర్ విజయ్ సాహసాలను కూడా చూపించనున్నారు. ఇందులో ఎస్‌జే సూర్య 'బ్లాక్ డాగర్' అనే శక్తివంతమైన ప్రతినాయకుడి పాత్రలో నటిస్తుండగా, మాళవిక మోహనన్, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ జులై 2024లో ప్రారంభమై జూన్ 2025లో పూర్తయింది. శ్యామ్ సీఎస్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. తెలుగు, తమిళంతో పాటు హిందీ, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు. త్వరలోనే ట్రైలర్‌కు సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ వెలువడనున్నాయి.

## బాహుబలి కంటే డబుల్ గ్యాప్.. నాగ్ అశ్విన్ క్రేజీ స్కెచ్!

బాక్సాఫీస్ ని షేక్ చేసిన కల్కి మొదటి భాగం వచ్చి అప్పుడే రెండేళ్లు అయిపోయింది. జూన్ 2024లో రిలీజ్ అయిన ఆ సినిమా తర్వాత, పార్ట్ 2 ఎప్పుడు వస్తుందా అని అంతా వెయిట్ చేస్తున్నారు. అయితే ఫ్యాన్స్ కి బోర్ కొట్టకుండా, వాళ్ళ క్యూరియాసిటీని అలాగే మెయింటైన్ చేసేలా డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఒక క్రేజీ ప్లాన్ చేస్తున్నట్లు ఫిల్మ్ నగర్ లో టాక్ నడుస్తోంది. దీని గురించి ఇంకా అఫీషియల్ గా అనౌన్స్ చేయకపోయినా ఈ న్యూస్ మాత్రం బాగా వైరల్ అవుతోంది. గతంలో బాహుబలి మొదటి భాగానికి, రెండో భాగానికి మధ్య దాదాపు 21 నెలల గ్యాప్ వచ్చింది. ఆ టైమ్‌లో కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు అనే ఒక్క పాయింట్ తోనే జనాలు వెయిట్ చేశారు. ఇప్పుడు కల్కి 2 సినిమాను 2027 డిసెంబర్ లో రిలీజ్ చేయాలని టార్గెట్ పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అంటే దాదాపు మూడున్నరేళ్ల గ్యాప్ వస్తుంది. బాహుబలితో పోలిస్తే ఇది డబుల్ గ్యాప్. ఇంత టైమ్‌లో సినిమా మీద హైప్ పడిపోకుండా చూసుకోవడం టీమ్ కి చాలా అవసరం. అందుకే ఈ గ్యాప్ ని ఫిల్ చేయడానికి వైజయంతీ మూవీస్ ఒక స్పెషల్ ప్లాన్ వేసిందట. కల్కి ప్రపంచంలో జనాలకు బాగా కనెక్ట్ అయిన క్యారెక్టర్స్ తో ఓటీటీలో స్పెషల్ ఎపిసోడ్స్ ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒక్కో ఎపిసోడ్ గంట సేపు ఉండేలా ప్లాన్ చేస్తున్నారట. ముఖ్యంగా దుల్కర్ సల్మాన్, అలాగే సాయి పల్లవి చేసిన సుమతి క్యారెక్టర్ల బ్యాక్ స్టోరీస్‌ని ఈసిరీస్‌లో చూపించ బోతున్నారని గట్టిగా టాక్ వినిపిస్తోంది. పార్ట్ 1 ఎక్కడైతే ఆగిపోయిందో అక్కడికి ఈ క్యారెక్టర్స్ ఎలా వచ్చాయి అనేది ఈ ఓటీటీ ఎపిసోడ్స్‌లో క్లియర్ గా చూపిస్తారట. దీనివల్ల థియేటర్లో పార్ట్ 2 చూసేట ప్పుడు స్టోరీ ఇంకా ఈజీగా అర్థమవుతుంది.

ఆడియన్స్‌ని డైరెక్ట్‌గా మెయిన్ సినిమాకు కనెక్ట్ చేయడానికి ఇదొక పర్ఫెక్ట్ బ్రిడ్జ లాగా పని చేస్తుంది. ఇలా చేస్తే సినిమా మీద ఇంట్రెస్ట్ తగ్గదు, పైగా పార్ట్ 2 కి వెళ్లేలోపు బజ్ ఇంకా పెరుగుతుంది. హాలీవుడ్ మార్వెల్ సినిమాల్లో ఇలాంటివి చాలానే వచ్చాయి.

## 'ధర్మన్ ని' నరసింహ 2అనొచ్చా?



సూపర్ స్టార్ రజినీకాంత్– ఉలగనాయగన్ కమల్ హాసన్ ల మధ్య ఉన్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనది. ఒకేసారి పరిశ్రమలోకి అడుగుపెట్టి బాక్సాఫీస్ వద్ద పోటాపోటీగా నిలిచినా? వ్యక్తిగత జీవితంలో వారిద్దరూ దశాబ్దాలుగా ప్రాణస్నేహితులుగా కొనసాగుతున్నారు. ఇటీవల ఓ సినిమా వేడుకలో కమల్ హాసన్ పంచుకున్న ఆసక్తికరమైన జ్ఞాపకం ఇటు సినీ వర్గాల్లోనూ, అటు అభిమానుల్లోనూ సరికొత్త ఆసక్తిని రేకెత్తించింది. దాదాపు నలభై ఏళ్ల క్రితం జరిగిన విమాన ప్రయాణంలో రజినీకాంత్ చిత్రానికి సంబంధించిన కీలకమైన ఆలోచన ఎలా పుట్టిందో వివరించారు. కమల్ హాసన్ వెల్లడించిన వివరాల ప్రకారం నలభై ఏళ్ల క్రితం ఒకానొక సందర్భంలో ఆయన, రజినీకాంత్ కలిసి విమానంలో ప్రయాణిస్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు మిత్రుల మధ్య సాగిన సాధారణ సంభాషణ అద్భుతమైన కథాంశానికి పునాది వేసింది. అలా ఆ ప్రయాణంలోనే –ధర్మన్– అనే ప్రాజెక్ట్ సంబంధించిన ప్రాథమిక ఆలోచన రూపుదిద్దుకుంది. ఇద్దరు లెజెండ్రీ నటుల మేధోమథనం నుండి పుట్టిన ఇలాంటి ఐడియాలు కేవలం కాలక్షేప చర్చలు కాకుండా.. వెండితెరపై సంచలనాలు సృష్టించే సత్తా ఉన్నవని ఈ సంఘటన మరోసారి నిరూపించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చల్లో పాల్గొన్న దర్శకుడు ఒకరు దీనిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కమల్ హాసన్ అప్పట్లో ప్రతిపాదించిన ఆ కథాంశం –రజినీకాంత్ పాత్ర చిత్రణ రజినీ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిన –పడయప్ప– (తెలుగులో నరసింహ) చిత్రంతో పోల్చదగినదని పేర్కొన్నారు. –పడయప్ప–లో రజినీకాంత్ మాస్ ఇమేజ్, ఆయన నటనలోని తీవ్రత ఏ స్థాయిలో ఉంటాయో? ఈ నలభై ఏళ్ల నాటి –ధర్మన్– ఐడియాలో కూడా అదే తరహా పవర్–ప్యాక్డ్ ఎలిమెంట్స్ ఉన్నాయని దర్శకుడు పోల్చి చెప్పడం విశేషం. సాధారణంగా ఇద్దరు అగ్ర నటులు ఒకే పరిశ్రమలో ఉన్నప్పుడు వారి మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంటుంది. కానీ కమల్, రజినీలు ఆ పోటీని పక్కనబెట్టి ఒకరి సినిమాలకు మరొకరు ఐడియాలు ఇచ్చుకోవడం, కథల చర్చల్లో పాల్గొనడం వంటివి చేసేవారనడానికి ఈ సంఘటన ఒక నిదర్శనం. రజినీకాంత్ మాస్ ఎనర్జీని కమల్ హాసన్ ఎంతగా ఆస్వాదించేవారో? అలాగే కమల్ లోని వైవిధ్యాన్ని రజినీ ఎంతగా గౌరవించేవారో ?ఈ నలభై ఏళ్ల నాటి విమాన ప్రయాణ ముచ్చట్లు మనకు స్పష్టం చేస్తున్నాయి. నలభై ఏళ్ల క్రితం అంటే 1980ల నాటి చిత్ర నిర్మాణ వాతావరణం ఇప్పటికంటే చాలా భిన్నంగా ఉండేది. అప్పట్లో నేటిలాంటి కార్పొరేట్ పద్ధతులు, సుదీర్ఘమైన బౌండ్ స్క్రిప్ట్ సంస్కృతి కంటే నటీనటులు, దర్శకుల మధ్య ఉండే వ్యక్తిగత సంబంధాలు, ఆకస్మిక సృజనాత్మక ఆలోచనల ఆధారంగానే గొప్ప కథలు పుట్టుకొచ్చేవి. ఒక విమాన ప్రయాణంలో పుట్టిన చిన్న ఆలోచనను ఒక మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా మార్చగలిగే ప్రతిభ నాటి సినిమా మేధావులకు ఉండేదనడానికి –ధర్మన్– వృత్తాంతమే ఒక ఉదాహరణ. ఇలాంటి ఐకానిక్ జ్ఞాపకాలు – చారిత్రక విశేషాలు వెలుగులోకి రావడం వల్ల పాత తరం సినిమా మేకింగ్ పట్ల నేటి తరానికి స్పష్టమైన అవగాహన వస్తుంది. కమల్ హాసన్, రజినీకాంత్ ల కలయికలో ఆ ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో రాకపోయినా? వారి ఆలోచనల వెనుక ఉన్న ఆనాటి సినిమాటిక్ ప్యాషన్ ఎప్పటికీ అమూల్యమైనది. పరిశ్రమలో ఎన్ని సాంకేతిక మార్పులు వచ్చినప్పటికీ ఇద్దరు లెజెండ్స్ మధ్య ఉన్న ఈ అద్భుతమైన సృజనాత్మక బంధం రాబోయే తరాల నటీనటులకు, దర్శకులకు ఎల్లప్పుడూ గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుంది.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662